వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

Published From : Rangareddy | VOLUME : 01 | Issue : 312 | Friday 30-10-2026 | Editor : Seggem Kiran Kumar | Pages : 08 | Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal–Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

భవిష్యత్తులో డబ్బు దాచుకోవడం వృథా

పదేండ్ల వయసులోనే కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించాలి

భారత్‌ను తీవ్రంగా దెబ్బకొట్టనున్న ఎల్‌నినో..

- మార్చి నాటికి 55 వేల మరణాలు..!
- అసాధారణ ఉష్ణోగ్రతలతో ప్రాణనష్టం పెరిగే అవకాశం
- అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు తీవ్ర ప్రభావం
- మార్చి నెలలోనే అత్యధిక మరణాలు సంభవించవచ్చని అంచనా
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల అదనపు మరణాలకు అవకాశం
- నైజీరియాలో 56 వేలు, ఇండోనేషియాలో 29 వేల మరణాల అంచనా
- డిసెంబర్‌లో ఎల్‌నినో తీవ్రత గరిష్ఠానికి చేరవచ్చని హెచ్చరిక

చదువుకున్నవారే మోసపోతే ఎలా?

- డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన
- ఫోన్‌లో బెదిరిస్తే అరెస్టయినట్లు ఎలా నమ్ముతారు?
- విద్యావంతులూ మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవడంపై విస్మయం
- బ్యాంకులు ఖాతాదారులకు రక్షణ కవచంగా నిలవాలి
- అనుమానాస్పద లావాదేవీలను ఎందుకు అడ్డుకోవడం లేదు?
- బాధితులకు పరిహారం అంశాన్ని ప్రస్తావించిన సీజేఐ సూర్యకాంత్

తెలంగాణలో ప్రతి పెట్టుబడికీ నాదే గ్యారంటీ!

పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి బంపర్ ఆఫర్

- పెట్టుబడులను రెట్టింపు చేయండి.. లాభాలనూ రెట్టింపు చేసుకోండి
- పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటానని ముఖ్యమంత్రి భరోసా
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ
- దేశ ఆర్థిక వ్యవస్థలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచుతాం
- హైదరాబాద్‌కు అనుసంధానంగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు
- డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు ప్రపంచ పెట్టుబడుల సదస్సు

న్యూఢిల్లీ, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి భద్రత కల్పించడంతోపాటు పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం, మౌలిక సదుపాయాలను అందించే బాధ్యతను తానే తీసుకుంటానని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడుల పరిమాణాన్ని రెట్టింపు చేయాలని, అందుకు అనుగుణంగా వృద్ధి,

-మిగతా 2 లో

కివీస్‌పై మరో విజయానికి భారత్ గురి!

- నేడు భారత్--న్యూజిలాండ్ నాలుగో టీ20
- ఆక్లాండ్ వేదికగా ఆసక్తికర పోరు
- వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా
- సిరీస్‌లో ఆధిక్యాన్ని మరింత పెంచుకోవడమే లక్ష్యం
- సొంతగడ్డపై పరువు నిలబెట్టుకునేందుకు కివీస్ పట్టుదల

నేడు పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల

- రైతుల ఖాతాల్లోకి రూ.18,680 కోట్లు!
- దేశవ్యాప్తంగా 9.34 కోట్ల రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం
- అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ.2 వేల జమ
- గుజరాత్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా నిధుల విడుదల
- సాగు పెట్టుబడులకు రైతులకు ఆర్థిక భరోసా

ఏపీ, తెలంగాణతో సహా ఆరు రాష్ట్రాల్లో సర్ గడువు పొడిగింపు

- ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణకు కొత్త షెడ్యూల్
- సవరించిన తేదీలను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఏపీలో నవంబర్ 20 వరకు పరిశీలనకు అవకాశం
- తెలంగాణలో నవంబర్ 26 వరకు గడువు పొడిగింపు
- క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అదనపు సమయం
- కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణకు అవకాశం
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలని ఈసీ సూచన

హైదరాబాద్,
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియకు సంబంధించి సవరించిన నూతన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం విడుదల చేసింది. ఓటర్ల నమోదు, వివరాల సవరణ, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను సమర్థంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ గడువును ఈసీఐ పొడిగించింది. ఏపీలో నవంబర్ 20 వరకు, తెలంగాణలోనూ నవంబర్ 26 వరకు గడువు పొడిగించింది. నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రచురించనుంది. నవంబర్ 25వ తేదీ వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు ఈసీఐ అవకాశం కల్పించగా, వీటి పరిష్కారానికి డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. డిసెంబర్ 22న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

-మిగతా 2 లో

మల్లన్నసాగర్‌పై సర్కార్ కుట్ర

- రిజర్వాయర్ భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నారని హరీశ్‌రావు ఆరోపణ
- కట్టకు 150 మీటర్ల దూరంలోనే భారీ పేలుళ్లపై ఆగ్రహం
- 400 మీటర్ల పరిధిలో బ్లాస్టింగ్ నిషేధ నిబంధనలు ఉల్లంఘించారని విమర్శ
- 20 మీటర్ల లోతున పేలుళ్లతో కట్ట అదురుతోందని ఆందోళన
- తిప్పారం గ్రామంలో ఇళ్లకు పగుళ్లు వచ్చాయని వెల్లడి
- అనుమతులు లేకుండా అర్ధరాత్రి పేలుళ్లు ఎవరి అండతో?: హరీశ్‌రావు
- బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి.. ఏజెన్సీపై కేసులు పెట్టాలి
- బ్లాస్టింగ్ ప్రాంతాల పరిశీలన.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ

సిద్దిపేట,
'మల్లన్నసాగర్ ప్రాజెక్టును కూల్చేందుకు రేవంత్ ప్రభు త్వం కుట్ర చేస్తున్నది. కట్టకు 150 మీటర్లలోనే అర్ధరాత్రి వేళ అక్రమ బ్లాస్టింగ్స్ జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ నీళ్ల కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే కట్ట సమీపంలోనే 20 మీటర్ల లోతున అడ్డగోలు పేలుళ్లు చేస్తుండటంతో రిజర్వాయర్ కట్ట అదురుతున్నది. దీంతో సీపేజీ పెరుగుతున్నది. కట్టకు 400 మీటర్ల లోపు పేలుళ్లు జరపకూడదన్న ఇరిగేషన్ నిబంధనలను తుంగలో తొక్కి, 150 మీటర్ల దూరంలోనే భారీ బ్లాస్టింగ్స్ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నది?' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు.

-మిగతా 2 లో

దేశవ్యాప్తంగా వాతావరణ బీభత్సం!

- ఒకవైపు తుపాను వర్షాలు.. మరోవైపు వడగళ్ల ముప్పు
- తూర్పు, మధ్య భారతదేశంలో భారీ వర్షాలకు అవకాశం
- ఉత్తరాది రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సూచన
- ఈదురుగాలులతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వాతావరణ శాఖ సూచనలు

హింసాత్మక నిరసనల్లో పాల్గొంటే నో జాబ్

- ఉత్తరప్రదేశ్‌లో యోగి సర్కార్ సంచలన నిర్ణయం
- హింసాత్మక ఆందోళనల్లో పాల్గొనేవారికి ఉద్యోగ అనర్హత
- అభ్యర్థుల ప్రవర్తన పరిశీలన నిబంధనల్లో కీలక సవరణలు
- 21 ఏళ్లు నిండిన అభ్యర్థుల గత మూడేళ్ల ప్రవర్తనపై ఆరా
- ప్రభుత్వ వ్యతిరేక సంస్థల్లో సభ్యత్వంపైనా పరిశీలన
- నిరుద్యోగ యువతలో ఆందోళన రేకెత్తిస్తున్న కొత్త నిబంధనలు
- ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారంటూ ప్రతిపక్షాల మండిపాటు

ఇది గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్ సమ్మిట్!

రాష్ట్రంలో నడుస్తున్నది రేవంత్‌రెడ్డి రాజ్యాంగమే: కేటీఆర్

- కరువుతో రైతులు కన్నీరు పెడుతుంటే సమ్మిట్‌ల పేరుతో హడావుడి
- రూ.లక్షన్నర కోట్ల మూసీ సుందరీకరణను తక్షణమే రద్దు చేయాలి
- మల్లన్నసాగర్ నుంచి మూసీకి 10 టీఎంసీలు ఎత్తిపోయడం తుగ్లక్ చర్య
- కన్నెపల్లి పంపులు ఆన్ చేస్తే నీటి ఎద్దడి వచ్చేది కాదని విమర్శ
- మూసీ నిధులతో రైతులకు రూ.60 వేల చొప్పున రైతుబంధు చెల్లించాలి
- కరువు నివారణలో ఏపీ సీఎం చంద్రబాబు ముందుచూపు భేష్
- క్షమాపణలు చెప్పేవారి జాబితాలో ఇంకా చాలామంది ఉన్నారంటూ వ్యాఖ్యలు



హైదరాబాద్,
కరువుతో తల్లడిల్లుతూ ఎండిన పంట చేలు చూస్తూ రైతులు కన్నీరు కారుస్తుంటే డబ్బులు లేవంటూనే సీఎం రేవంత్ రెడ్డి రూ. లక్షన్నర కోట్ల మూసీ సుందరీకరణకు హంగామా చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. వేల ఎకరాలను దోపిడి చేసేందుకు డీపీఆర్ లేకుండా మూసీ సుందరీకరణ అని నీతికి సీఎం రేవంత్ పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రమవుతుంటే మల్లన్న సాగర్ నుంచి 10 టీఎంసీలు మూసీలో ఎత్తి పోస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడం పిచ్చి తుగ్లక్ చర్యని

-మిగతా 2 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com

భారత్‌ను తీవ్రంగా దెబ్బకొట్టనున్న ఎల్‌నినో..

న్యూఢిల్లీ

భారతదేశాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బకొట్టనుందా..? ఎల్‌నినో కారణంగా పెరుగుతున్న అసాధారణ ఉష్ణోగ్రతలు రాబోయే నెలల్లో ప్రాణనష్టాన్ని పెంచనున్నాయా..? తాజా పరిశోధన ఆధారిత అంచనాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానం ఇస్తున్నాయి. అమెరికా లోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన న్యూ ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి నాటికి భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణస్థాయికి మించి సుమారుగా 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉన్నది. ఆ మరణాల్లో ఎక్కువ భాగం మార్చి నెలలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ అంచనా వేసింది.ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఈ అంచనా కచ్చితంగా వెల్లడించడం లేదు. కాగా, ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంవల్ల సంభవించే ఓ పరిణామం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠస్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేసింది. న్యూ ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని న్యూ ట్రాకర్ పేర్కొన్నది. అయితే ఈ న్యూ ట్రాకర్ అంచనాలు మరణాలు తప్పనిసరిగా సంభవిస్తాయని చెప్పడంలేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

చదువుకున్నవారే మోసపోతే ఎలా?

న్యూఢిల్లీ

డిజిటల్ అరెస్టు కేసులు పెరుగుతున్న అంశంపై సుప్రీంకోర్టు(ాబజూతీవవవ జశీబతీ) ఆందోళన వ్యక్తం చేసింది.చదువుకున్నవారు కూడా మొబైల్ ఫోన్లో ఎలా డిజిటల్ అరెస్టు అవుతున్నారని కోర్టు షాక్ వ్యక్తం చేసింది. ప్రజల్లో అవగాహన కల్పించినా ఎలా ఇలాంటి నేరాలు జరుగుతున్నాయని అత్యున్నత న్యాయస్థానం విస్మయానికి గురైంది. డిజిటల్ అరెస్టులపై సుమోటో కేసులో సుప్రీం వాదనలు విన్నది. ఈ నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ.. అసలు ఈ బాధితులతో ఏం జరుగుతోంది, ఎలా బాధితులు ట్రాప్ అవుతున్నారని ఆయన వాదనల సమయంలో ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బేసిక్ విషయం కూడా వాళ్లకు అర్థం కాదా, ఫోన్‌లో భయపెట్టి డిజిటల్ అరెస్టు చేస్తారా అని ఆయన అన్నారు.ప్రజల్లో ఏదో పొరపాటు జరుగుతోందని, అదేంటో దేవుడికే తెలియాలని, ప్రజాస్వామ్య దేశంలో ఫోన్ ద్వారా అరెస్టు అవుతున్నారంటే మీరేంటో ఆలోచిస్తున్నారా అని సీజేఐ అన్నారు. డిజిటల్ ఫ్రాడ్ కేసుల్లో బ్యాంకులు బాధ్యత తీసుకోవాలని, బాధితులకు నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. కస్టమర్లకు బ్యాంకులు ఓ రక్షకకవచంలా ఉండాలన్నారు. పదవీవిరమణ చేసిన వ్యక్తి బ్యాంక్ అకౌంట్ నుంచి భారీ మొత్తంలో విత్‌డ్రా జరుగుతుంటే, ఎందుకు బ్యాంకులు జోక్యం చేసుకోవడం లేదని సీజేఐ నేతృత్వంలోని బెంచ్ ప్రశ్నించింది. అయితే అనుమానిత లావాదేవీలను బ్యాంకులు గుర్తిస్తున్నాయని, నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాయని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టులో తెలిపారు. ప్రజలతోనే ఏదో తప్పు ఉందని, దేవుడికే ఆ విషయం తెలియాలని, మీకు మీరు బాధితులవుతున్నారని, విద్యావంతులు ఫ్రాడ్‌కు గురవుతున్నారని తెలుసుకోవడం ఆందోళన కలిగిస్తోందని సీజేఐ అన్నారు.

కివీస్‌పై మరో విజయానికి భారత్ గురి!

ఆక్లాండ్:
న్యూజిలాండ్ గడ్డపై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత క్రికెట్ జట్టు మరో కీలక సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆక్లాండ్ వేదికగా జరగనున్న నాలుగో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఇప్పటికే సిరీస్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించిన టీమిండియా మరో విజయంతో తన జైత్రయాత్రను కొనసాగించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు సొంతగడ్డపై వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న న్యూజిలాండ్ కనీసం ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. దీంతో ఇరు జట్ల మధ్య పోరు ఆసక్తికరంగా మారనుంది. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ప్రత్యర్థి బౌలర్లపై ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగుతూ భారీ స్కోర్లు సాధిస్తున్నారు. ముఖ్యంగా పవర్‌ప్లే ఓవర్లలో వేగంగా పరుగులు రాబట్టడం, మధ్య ఓవర్లలో భాగస్వామ్యాలు నెలకొల్పడం భారత విజయాల్లో కీలకంగా మారింది. బౌలింగ్ విభాగం కూడా అవసరమైన సమయాల్లో వికెట్లు పడగొడుతూ జట్టుకు అండగా నిలుస్తోంది. ఇదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలని భారత జట్టు భావిస్తోంది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ మైదానం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశముండటంతో మరోసారి భారీ స్కోర్లు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చిన్న బౌండరీలు బ్యాటర్లకు అనుకూలంగా మారే అవకాశమున్నప్పటికీ బౌలర్లు కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బంతులు సంధించాల్సి ఉంటుంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు ఈ మ్యాచ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. గత మ్యాచ్‌ల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని భారత బ్యాటర్లను కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సొంత మైదాన పరిస్థితులను సద్వినియోగం చేసుకుని విజయాన్ని అందుకోవాలని ఆశిస్తోంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో భారత బ్యాటర్లను త్వరగా పెవిలియన్‌కు పంపగలిగితే మ్యాచ్‌పై పట్టు సాధించవచ్చని కివీస్ భావిస్తోంది. అయితే ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత జట్టును నిలువరించడం ఆతిథ్య జట్టుకు సవాలుగా మారనుంది. సిరీస్‌లో మరో విజయాన్ని నమోదు చేయాలని భారత్, పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉండటంతో నాలుగో టీ20 అభిమానులకు ఉత్కంఠభరిత పోరును అందించే అవకాశముంది.

హింసాత్మక నిరసనల్లో పాల్గొంటే నో జాబ్

లక్నో : ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. హింసాత్మక నిరసనల్లో పాల్గొని ప్రభుత్వాన్ని మార్చడానికి ప్రయత్నించే వారిని, అలాంటి సంస్థల్లో సభ్యత్వం ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా గుర్తిస్తామని చెప్పింది. ఈ మేరకు అభ్యర్థుల క్యారెక్టర్ వెరిఫికేషన్‌లో కీలక సవరణలు చేసింది.అభ్యర్థికి 21ఏండ్లు నిండిన తర్వాత అతని గత మూడేండ్ల ప్రవర్తనపై వెరిఫికేషన్ చేస్తారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇచ్చే సంస్థల్లో సభ్యత్వం ఉన్నా, అలాంటి నిరసనల్లో పాల్గొన్నా అతన్ని అనర్హుడిగా ప్రకటిస్తారు. వివిధ శాఖలు, కార్పొరేషన్లు, బోర్డులు, స్థానిక సంస్థల్లో నేరుగా భర్తీ చేసే కొలువులపై ఈ ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించాయి.

తెలంగాణలో ప్రతి పెట్టుబడికీ నాదే గ్యారంటీ!

మొదటి తరువాయి

లాభాలను కూడా రెట్టింపు చేసుకునే అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించి, వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026' సన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ దేశాల రాయబార కార్యాలయాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సీఐఐ సభ్యులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు దేశవిదేశాల పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ముందుగా ఒక సంఖ్యను నిర్ణయించుకుని, ఆ మొత్తాన్ని రెట్టింపు చేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. అందుకు అనుగుణంగా ఆశిస్తున్న వృద్ధి రేటును, లాభాలను కూడా రెట్టింపు చేసుకోవాలని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అవసరమో నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పెట్టుబడులకు భద్రత కల్పించడం, పరిశ్రమలు అభివృద్ధి చెందేలా చూడడం తన వ్యక్తిగత బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు సంరక్షకుడిగా ఉంటానని స్పష్టం చేశారు. వ్యాపార రంగంలో ప్రభుత్వ పెద్దలకంటే పారిశ్రామికవేత్తలకే ఎక్కువ అనుభవం ఉంటుందని, అందుకే వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు వచ్చానని వివరించారు. పారిశ్రామికవేత్తల నుంచి వచ్చే సూచనలను పరిశీలించి అవసరమైన వాటిని ప్రభుత్వ విధానాలుగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల స్థాపన నుంచి విస్తరణ వరకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతుందని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. వికసిత్ భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్--2047 భవిష్యత్తు ప్రణాళికను రూపొందించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ కీలక భాగస్వామిగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే అందులో తెలంగాణ వాటా కనీసం 10 శాతంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటా సుమారు ఐదు శాతంగా ఉందని పేర్కొన్నారు. ఈ వాటాను రెట్టింపు చేసే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ లక్ష్యాల సాధనకు పారిశ్రామికవేత్తల పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరమని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలు, విధానపరమైన సూచనలను ప్రభుత్వానికి అందించాలని కోరారు. పెట్టుబడిదారుల సూచనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో అవసరమైన మార్పులు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా సహకారం అందుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించగా, వాటిలో మూడు హైదరాబాద్‌కు అనుసంధానం కానున్నాయని వెల్లడించారు. హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే హైదరాబాద్ నుంచి ప్రధాన నగరాలకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కూడా కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర సహకారం అందుతోందని వివరించారు. రవాణా వ్యవస్థ బలోపేతంతో పరిశ్రమల విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు మరింత అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. చారిత్రక వైభవం, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక నైపుణ్యం, మేధోసంపత్తి వంటి అంశాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. ఐటీ, ఔషధ, జీవశాస్త్ర, రక్షణ, అంతరిక్ష, తయారీ రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే భారీ పెట్టుబడులు రావాలని, పరిశ్రమలు విస్తరించాలని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఐఐ తెలంగాణ చైర్మన్ ఎం. గౌతమ్‌రెడ్డి, సీఐఐ అధ్యక్ష పదవికి ఎంపికైన భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా కె. ఎల్లా ప్రసంగించారు. రాష్ట్ర మంత్రులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం దీపావళి సందర్భంగా ఆర్థిక భరోసా కల్పించేందుకు సిద్ధమైంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 24వ విడత నిధులను శుక్రవారం విడుదల చేయనుంది. ఈ విడతలో దేశంలోని సుమారు 9.34 కోట్ల రైతు కుటుంబాలకు రూ.18,680 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.2 వేల చొప్పున అందనున్నాయి. గుజరాత్‌లోని బనాస్‌కాంతా జిల్లా ఖీల్డీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రైతులకు వ్యవసాయ పెట్టుబడి అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొంది. పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన రైతు కుటుంబాలకు ఏటా రూ.6 వేల ఆర్థిక సాయాన్ని మూడు విడతల్లో అందిస్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం రైతులు ఈ నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు సాగు సమయంలో అవసరమైన పెట్టుబడిని సమకూర్చడంలో ఈ ఆర్థిక సాయం ఉపయోగపడుతుందని కేంద్రం భావిస్తోంది. రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధి చేకూరుతుందని అధికారులు పేర్కొంటున్నారు. పథకం ప్రయోజనాలు పొందేందుకు రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడంతోపాటు తప్పనిసరి ఎలక్ట్రానిక్ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. భూమి రికార్డులు, లబ్ధిదారుల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లయితే నిధుల జమలో ఆలస్యం జరిగే అవకాశముందని అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ అర్హత, లబ్ధిదారుల స్థితి, చెల్లింపుల వివరాలను పీఎం కిసాన్ అధికారిక పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, రైతుల ఆదాయానికి అదనపు మద్దతు కల్పించడం, సాగు ఖర్చుల భారాన్ని కొంతవరకు తగ్గించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. తాజాగా విడుదల చేయనున్న రూ.18,680 కోట్లతో కోట్లాది రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని వెల్లడించింది.

దేశవ్యాప్తంగా వాతావరణ బీభత్సం!

న్యూఢిల్లీ:



దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారుతున్నాయి. ఒకవైపు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తుండగా, మరోవైపు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు, వడగళ్ల వాన ముప్పు పొంచి ఉంది. తూర్పు, మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా బిహార్, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశముంది. మరోవైపు ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముండగా, మరికొన్ని ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులతోపాటు వడగళ్ల వాన పడే ప్రమాదముందని వాతావరణ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పంట కోతలు, వ్యవసాయ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో అకాల వర్షాలు రైతులకు ఇబ్బందులు కలిగించే ప్రమాదముంది. బలమైన గాలులతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదముందని, రహదారులపై నీరు నిలిచిపోవడంతో రవాణాకు అంతరాయం ఏర్పడవచ్చని హెచ్చరిస్తున్నారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడకూడదని, అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను పరిశీలించిన తర్వాతే పంట కోతలు, ఎరువులు, పురుగుమందుల పిచికారీ వంటి వ్యవసాయ పనులు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల నేపథ్యంలో ప్రజలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే నిర్ధారణలేని సమాచారాన్ని నమ్మకుండా భారత వాతావరణ శాఖ విడుదల చేసే అధికారిక హెచ్చరికలను అనుసరించాలని సూచిస్తున్నారు.

ఏపీ, తెలంగాణతో సహా ఆరు రాష్ట్రాల్లో సర్ గడువు పొడిగింపు

మొదటి తరువాయి

ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల(సీఈఓ) విజ్ఞప్తులు, రాజకీయ పార్టీల అభ్యర్థనలను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం ప్రజలకు, కొత్త ఓటర్లకు దరఖాస్తులు సమర్పించడానికి అదనపు సమయం లభించింది. క్లెయిమ్స్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియకు ఈసీ ఈ పొడిగించిన గడువును కల్పించింది. గ్రామాలు, పట్టణాల్లో బూత్ స్థాయి అధికారులు(బీఎల్ఓ) ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన అర్హులైన పౌరుల వివరాలను నమోదు చేయడంతో పాటు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందిస్తారని అధికారులు వెల్లడించారు. పొడిగించిన గడువు ప్రకారం స్వీకరించిన క్లెయిమ్స్‌లు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించనున్నారు. అర్హత కలిగిన ఓటర్లందరూ ఈ పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది.

మల్లన్నసాగర్‌పై సర్కార్ కుట్ర

మొదటి తరువాయి

బ్లాస్టింగ్ ధాటికి కిలోమీటర్ దూరంలోని తిప్పారం గ్రామంలో ఇండ్లు నెర్రెలు బారినట్టు తెలిపారు. పనులు ఆపాలని ఇరిగేషన్ అధికారులు లేఖ రాసినా బేఖాతరు చేసిన జలమండలి అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. పోలీస్, రెవెన్యూ అధికారులను అడిగితే తామెవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారని తెలిపారు. అర్ధరాత్రి వేళ ఈ దొంగ బ్లాస్టింగ్స్ ఎవరి అండతో జరుగుతున్నాయి? అని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ బ్లాస్టింగ్స్ ఆపి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని కోరారు. గురువారం సిద్దిపేట జిల్లా తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో పైప్‌లైన్లు, పంప్‌హౌస్ నిర్మాణం కోసం జలమండలి అనధికారికంగా భారీ బ్లాస్టింగ్స్ చేపడుతున్న ఘటనా స్థలాలను తిప్పారం గ్రామస్తులు ఫిర్యాదుతో హరీశ్‌రావు గురువారం పరిశీలించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బకి వెంకటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, తిప్పారం గ్రామస్తులతో కలిసి రిజర్వాయర్ కట్టను, అక్రమ బ్లాస్టింగ్స్ జరుగుతున్న ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేలుళ్ల ఘటనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఇది గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్ సమ్మిట్!

మొదటి తరువాయి

దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును తక్షణం నిలిపివేసి, ఆ నిధులను రైతాంగ సంక్షేమం కోసం వాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే, సీఎం గ్లోబల్ సమ్మిట్ అంటూ హడావుడి చేస్తున్నారని, ఇది గ్లోబల్ సమ్మిట్ కాదు... గోబెల్ సమ్మిట్ అని విమర్శించారు. క్రాప్ హాలీడే, పవర్ హాలీడే, పారిశ్రామిక హాలీడేలు ప్రకటిస్తున్నసీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు హాలీ డే ప్రకటిస్తే దరిద్రం వదులు తుందని కేటీ ఆర్ దుయ్యబట్టారు. కన్నెపల్లి పంపు హౌస్ ఆన్ చేసి నీటిని ఎత్తి పోసే అవకాశాలున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నీటి ఎద్దడి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

మూసీ సుందరీకరణ నిలిపివేయాలి

మూసీ సుందరీకరణ పేరుతో చేపట్టిన ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ రూ.లక్షన్నర కోట్లతో రాష్ట్రంలోని 7లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన మూడు విడతలతో పాటు ప్రస్తుత ఖరీఫ్‌కు కలిపి ఒక్కో రైతుకు రూ. 60వేలు రైతుబంధు చెల్లించాలని ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణకు డీపీఆర్ లేనప్పటికీ ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అప్పు పేరుతో రేవంత్ లూటీకి తెరలేపారని దుయ్యబట్టారు.

ఇంకా క్షమాపణ చెప్పేవారు అనేకం ఉన్నారు

మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ, ఇంకా ఆ వరుసలో క్షమాపణలు చెప్పేవాళ్లు అనేకమంది ఉన్నారని చెప్పారు.

చంద్రబాబును అభినందించిన కేటీఆర్

కరువు తాకకుండా ముందస్తు చర్యలు తీసుకున్న ఏపీ సీఎం చంద్రబాబును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అభినందించారు. తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఉన్న ఏపీలో కరువులేదని, చంద్రబాబు ముందుచూపుతో నీళ్లు ఎత్తిపోసుకున్నారన్నారు. తెలంగాణలో అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిని ఒడిసిపట్టక వృథా చేస్తే చంద్రబాబు సమర్థవంతంగా నీటిని పట్టి ఆంధ్రకు కరువు రాకుండా చేశారని ప్రశంసించారు. కాగా అనేక పర్యాయాలు చంద్రబాబును విమర్శించిన కేటీఆర్, నీటిని సమర్థవంతంగా ఉపయోగంలోకి తెచ్చినందుకు అభినందించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కొండా సురేఖ ఏం చెప్పారు నేను చూడలేదు, చూసిన అనంతం మన లీగల్ టీంతో చర్చించి ఏం చేయాలో ఆలోచించనున్నట్లు వివరించారు. నిజం నిలకడ మీదనే తెలుతుంది మొన్ననే ఒక పేపర్ క్షమాపణ చెప్పింది.. ఇప్పుడు ఈ మేడం చెప్పారు.. రేపు ఇంకా క్షమాపణలు చెప్పేవారు ముందువరుసలో చాలా మంది ఉంటారని అన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఎంపీ వద్దిరాజు లక్ష్మీదేవిపల్లిలో పట్టభద్రులను కలిసి ఓట్లు నమోదు చేయించారు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 29. :
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించారు. శాసనమండలిలోని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న ఎంపీ రవిచంద్ర గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం స్టేజీ వద్ద స్వయంగా ఇల్లిల్లు తిరిగి పలువురు పట్టభద్రులను కలిసి వారి ఓట్లను నమోదు చేయించారు. ఎంపీ రవిచంద్ర పట్టభద్రులైన గృహిణుల చేత ఎన్నికల సంఘం జారీ చేసిన ఫారం -18ని పూర్తి చేయించి వారి పేర్లను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట పార్టీ నాయకులు కొట్టి వెంకటేశ్వర రావు, భద్రు, బాలు, శ్రీను, రమేష్, గోపాల్, రాము, కన్ని, శివ తదితరులు ఉన్నారు.

ఏపీ స్థానిక ఎన్నికల్లో కూటమిదే హవా!

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి భారీ విజయావకాశాలు
- చాణక్య ఎన్నికల సర్వే నివేదికను వెల్లడించిన ఎండీ ముఖేష్
- 13 మేయర్, చైర్మన్ స్థానాలు కూటమికేనని అంచనా
- 860 కార్పొరేటర్ స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందని వెల్లడి
- 22 స్థానాల్లో వైసీపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులకు అవకాశమని అంచనా
- తుపాను ప్రభావంతో పోలింగ్ శాతం తగ్గే అవకాశముందని వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 29.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 మున్సిపాలిటీ కార్పొరేషన్ లో 13 చైర్మన్, మేయర్ స్థానాలను 860 కార్పొరేటర్లుగా కైవసం చేసుకుంటారని ఆయన తెలిపారు 22 డివిజన్ కార్పొరేటర్ వైయస్సార్, స్వతంత్ర అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన తెలిపారు ఎమ్మెల్యే పనితీరును బట్టి కార్పొరేటర్ మున్సిపల్ చైర్మన్ గెలుపు పొందుతారని ఆయన వివరించారు కూటమి అభ్యర్థులు అధిక స్థానంలో గెలుపొంది ఏకగ్రీవం కూడా పిలుస్తారని ఆయన వివరించారు చంద్రబాబు నాయుడు చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు చూసి టిడిపి పార్టీకి గెలిపించడానికి అభ్యర్థులకు కృషి చేస్తారని ఆయన తెలిపారు ఏపీలో అబ్బాద్ తాండవం వల్ల ప్రజలు సరిగా ఓటు హక్కు వినియోగం ఉంచుకోలేక పోతారని ఆయన చెప్పారు

పెద్ద చీకోడులో మొహమ్మద్ రఫీ కుటుంబానికి కత్తి కార్తిక గౌడ్ అండ

ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తుకు రూ.10 వేల పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్

దుబ్బాకప్రతినిధి(వార్తసంధ్య)
అక్టోబర్ 29:దుబ్బాక మండలం పెద్ద చీకోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ యువ నాయకుడు మొహమ్మద్ రఫీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ పరామర్శించారు. రఫీ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి ఈ కష్టకాలంలో అండగా ఉంటామని కత్తి కార్తిక గౌడ్ భరోసా ఇచ్చారు. రఫీ ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టీం కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు ఆడపిల్లల పేర్లపై రూ.10,000 విలువైన పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిరె నరేష్, 1వ వార్డు సభ్యుడు ఎండీ షరీఫ్, 9వ వార్డు సభ్యురాలు భార్గవి, 8వ వార్డు సభ్యులు రజిత-నర్సిములు, గ్రామ మైనారిటీ అధ్యక్షుడు ఎండీ షాబూతో పాటు దొడ్ల కిషన్, శివశంకర్, కృష్ణ గౌడ్, రాజశేఖర్, శివ, ఎండీ గౌస్, ఎండీ నిజామ్, ఎండీ సాధక్ అలీ, ఎండీ రఫీ, ఎండీ మొయినుద్దీన్, ఎండీ బషీర్, చంద్రయ్య, గంగయ్య, ఎల్లయ్య, సంతు, సాయిబాబు, ఎండీ ఆరిఫ్, మహేంద్ర గౌడ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ రఫీ కుటుంబానికి ఫోటో స్టూడియో యూనియన్ ఆర్థిక సాయం



దుబ్బాక ప్రతినిధి(వార్తసంధ్య)అక్టోబర్ 29
:ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చీకోడ్ గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ కుటుంబానికి దుబ్బాక మండలం ఫోటో స్టూడియో యూనియన్ అండగా నిలిచింది. యూనియన్ తరపున రూ.50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రఫీ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని యూనియన్ సభ్యులు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బూసిరెడ్డి శంకర్‌రెడ్డి!

- టీఆర్ఎస్ (డి) పార్టీ అభ్యర్థిగా పోటీ
- అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ
- వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో విజయమే లక్ష్యం
- నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ
- పట్టభద్రుల గొంతుకగా శాసనమండలిలో నిలుస్తామన్న శంకర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 29.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి కల్పన ఉచిత గృహ నిర్మాణం రైతు సంక్షేమం మహిళా సంక్షేమం జయశంకర్ క్యాంటీన్లో అభివృద్ధి సంక్షేమానికి చూసి అని టిఆర్ఎస్ డి పార్టీ అధ్యక్షుడు నారల సత్యనారాయణ తెలియజేశారు రెండు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో విద్యార్థులను యువతను మేధావులను టీచర్లను లెక్చలర్లను లాయర్లను డాక్టర్లను ఇంజనీర్లను వివిధ డిపార్ట్మెంట్లు పనిచేస్తున్న వారిని నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకుని శాసనమండలం గలాన్ని వినిపిస్తారని రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ చెప్పారు ఈ కార్యక్రమంలో నల్గొండ వరంగల్ ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బూసి రెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీ గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని చెప్పారు నిరుద్యోగ యువత కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు తనను భారీ మెజార్టీతో యువత గెలిపించాలని ఆయన కోరారు సామాజికవేత్త రాజకీయవేత్త రోటరీ క్లబ్ ద్వారా వేల కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు చేసి మానవతవాది నల్లగొండ వరంగల్ ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ది పక్షాన పోటీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ సమావేశంలో చేరికల కమిటీ కళ్లెం లక్ష్మీనారాయణ రాష్ట్ర యువజన అధ్యక్షులు మొహమ్మద్ అహ్మద్ భాష మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గోగొర్ల రాజేశం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు సాగు శంకర్ ఖమ్మం నల్లగొండ జిల్లా అధ్యక్షులు మేకల వెంకన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జ్ భువనపల్లి అంజయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోడే శివకుమార్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి గంగాధర్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు మహిళా సురేఖ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు గద్దల లక్ష్మి హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బైరాగి అరుణ మేడ్చ జిల్లా అధ్యక్షులు మంద మురళి ముదిరాజ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజ బోయిన రేఖ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు మంద లావణ్య రాష్ట్ర మహిళా కార్యదర్శి మంద శ్రీలత తదితరులు పాల్గొన్నారు

సీఎం బ్రేక్‌ఫాస్ట్ కిచెన్‌ను త్వరితగతిన ప్రారంభించాలి

అప్పాయిగూడెం మెగా సెంట్రలైజ్డ్ కిచెన్‌ను సందర్శించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 29 (వార్త సంధ్య):
ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామంలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెగా సెంట్రలైజ్డ్ కిచెన్‌ను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే చొరవతో ఏర్పాటు చేసిన ఈ కిచెన్ షెడ్‌ను ఆయన సందర్శించి, ప్రారంభానికి అవసరమైన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కిచెన్ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, షెడ్ చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు.

మూడు జిల్లాల విద్యార్థులకు అల్పాహారం
ఈ మెగా సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం కింద అల్పాహారం అందించనున్నారు. ఈ కేంద్రం ప్రారంభమైతే ఆయా జిల్లాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు దోహదపడనుంది. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చదువుల్లో రాణించేలా ప్రోత్సహించి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల ఆరోగ్యం, మెరుగైన విద్య, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కిచెన్ ప్రారంభ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి పరుగులు!

-అభివృద్ధి నిధుల మంజూరుకు ఎల్లప్పుడూ ముందుంటా
-వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 29 (వార్త సంధ్య):
అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండలం మొట్లగూడెంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో మాణిక్యారం క్లస్టర్ పరిధిలోని 10 గ్రామపంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. శాఖల వారీగా నివేదికలు తెప్పించుకుని, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమన్వయంతో పనిచేయాలి
స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో గౌరవంగా మెలుగుతూ, పరస్పర సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాలకు అవసరమైన అభివృద్ధి నిధులను మంజూరు చేయించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్నవారు
ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీవో బి. పద్మ, తహసీల్దార్ ఓ. వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సర్పంచులు సుజాత, పెంటయ్య, మంగ, రంజిత్, హీరాలాల్, టోనీ, హేమలత, భద్రం, ఎల్లయ్య, మాజీ ఎంపీపీ మంజుల, దేవులా, సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌తో పాటు భీముడు, అర్జున్‌రావు, భావ్‌సింగ్, ఐలయ్య, పుల్లారావు, ఉమాశంకర్, రూపుల, ఉపేందర్, షఫీ మజ్జు, గాంధీ, పవన్, హనీఫ్, రాములు, నిర్మల, రాజు, సెట్ రాం, నవీన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి గౌడ్ కుటుంబానికి కత్తి కార్తిక గౌడ్ భరోసా

దుబ్బాక నియోజకవర్గ ప్రతినిధి(వార్తసంధ్య), అక్టోబర్ 29
మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామానికి చెందిన గుడికందుల స్వామి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తండ్రిని కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు టీం కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని, చిన్నారి భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందిస్తామని కత్తి కార్తిక గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయిలు, బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యుడు వీరయ్య, రాజు, రాజు గౌడ్, ప్రవీణ్, నరస గౌడ్, నరేష్, లోకేష్, వెంకటేష్, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెప్పి చెప్పి... నోరు నొప్పి

-అడవిని తలపిస్తున్న భారత్ గ్యాస్ గోడౌన్
-అడగడుగునా పాముల దర్శనం
వణుకుతున్న గోడౌన్ సిబ్బంది, వినియోగదారులు
-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు ,కార్మిక కుటుంబాలు
-పట్టించుకోని ఏరియా సివిల్ అధికారులు
-జిఎం గారు జర చూడరా

సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 29 (వార్త సంధ్య)
సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ లో ఉన్న భారత్ గ్యాస్ గోడౌన్ ఏరియా సివిల్ అధికారుల నిర్లక్ష్యంతో అడవిని తలపిస్తుంది. ఎటు చూసినా చెట్ల పొదలు, చెత్తాచెదారం తో దర్శనమిస్తుంది. గోడౌన్ పరిసర ప్రాంతంలో చెట్ల ఆకులు రాలి ఎక్కడికి అక్కడ పేరుకుపోయి ఉన్నాయి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన చెట్ల పొదలతో పాటు రాలిన ఆకుల కింద పాములు, విషపూరిత కీటకాలు ఉండటంతో వాటిని చూసి గోడౌన్ సిబ్బందితోపాటు గ్యాస్ వినియోగదారులు బెంబేలెత్తుతున్న పరిస్థితి నెలకొంది. పాములు విష కీటకాలు పరిసర ప్రాంతాల్లోని కార్మికుల ఇండ్లలోకి చొరబడుతుండడంతో కార్మిక కుటుంబాలు సైతం భయాందోళనకు గురవుతున్నాయి. గతంలో 15 రోజులకు ఒకసారి గోడౌన్ పరిసర ప్రాంతాలను సివిల్ కాంట్రాక్టు కార్మికులతో శుభ్రం చేయించే వారని ప్రస్తుతం నెలలు గడుస్తున్న చెప్పి చెప్పి ...నోరు నొప్పి అన్నట్లు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోతుందని గోడౌన్ సిబ్బందితో పాటు పరిసర ప్రాంతాల కార్మికులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడౌన్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఏరియా జిఎంతో పాటు సివిల్ ఏజీఎంను సిబ్బందితోపాటు స్థానికులు కోరుతున్నారు. ఎప్పటి మాదిరిగానే 15 రోజులకు ఒకసారి గోడౌన్ పరిసర ప్రాంతంలో చెట్లు పెరగకుండా, చెత్తాచెదారం లేకుండా చూడడంతో పాటు పాములు విష కీటకాల భారీ నుంచి తమను కాపాడాలని కార్మికులు, కార్మిక కుటుంబాలు అధికారులను కోరుతున్నారు.

పేరుపల్లిలో కోతుల బెడద.. ఆందోళనలో రైతులు!

-పంటలను కాపాడుకోలేక అవస్థలు..
- కోతుల సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు విజ్ఞప్తి

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 29 (వార్త సంధ్య):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో కోతుల బెడదతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని కాంగ్రెస్ యువజన నాయకుడు చిలుముల రఘు కోర్తున్నారు . కోతుల సంచారం పెరగడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలపై కోతులు దాడి చేస్తుండటంతో నష్టపోతున్నామని, వాటి బెడద నుంచి తమకు ఉపశమనం కల్పించాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పేరుపల్లి గ్రామ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సిరిసిల్లలో తెలంగాణ జానపద కళల మహాసభ!

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 29.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తెలంగాణ పిఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య పాల్గొని కళాకారులకు మద్దతు ఉంటుందని తెలిపారు నిరుద్యోగ కళాకారులు శ్యామ్, సంగీత డైరెక్టర్ వేణు, కళాకారుడు మోహన్ రావు సిని సంగీత డైరెక్టర్ బోలె తదితరులు పాల్గొని ప్రసంగించారు నవంబర్ 3 తేదీన జరిగే ఫోక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ , బిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కేటీఆర్ కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారని సినీసంగీత దర్శకుడు బోలె తెలిపారు

అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో 29, అక్టోబర్ (వార్త సంధ్య)
అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని, దోస్తులను కఠినమైన శిక్ష విధించేలా చర్యలు చేపడతామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పాల్వంచ మృతుడు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రి,పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. శిక్షార్హులైన వారెవరినీ ఉపేక్షించకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అనంతుల లక్ష్మీనారాయణకు 18 అవార్డులు లభించాయని, దక్షిణ భారతదేశ స్థాయిలోనే ఉత్తమ గుర్తింపు పొందారని, జాతీయ స్థాయి అవార్డు సాధించాలన్నది ఆయన కలగా ఉండేదని కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరే ఉద్యోగికీ ఇలాంటి అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, సంబంధిత శాఖాపరమైన అంశాలపై కూడా అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, పాల్వంచ తహసీల్దార్ ధారా ప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 29, (వార్త సంధ్య)
భారత ప్రభుత్వ యువజన సర్వీసులు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశం యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువత తమ ఆలోచనలు,అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుంది. యువతలో పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, దేశ నిర్మాణంలో యువత పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం తేదీ: 31 అక్టోబర్ 2026. సమయం: 09:30 గంటలకు వేదిక: డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నందు "వన్ నేషన్ - వన్ ఎలక్షన్" అనే అంశంపై 3 నిమిషాలు మాట్లాడే సమయం.18 నుండి 25 సంవత్సరాల యువతీ యువకులు పాల్గొనే అవకాశం కలదు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి మద్దుల వెంకట రాంబాబు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు,తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలో పారదర్శకతలు పాటించాలి

-జిల్లా ఇమ్యూనిషన్ అధికారి డాక్టర్ ప్రతాప్

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, 29,అక్టోబర్ (వార్త సంధ్య)
వైద్య సేవలో జిల్లాల్లో ఉన్నటువంటి వైద్య శాఖ అధికారులు పారదర్శకతను పాటించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇమ్యూ నేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ వైద్యులకు సూచించారు. గురువారం జిల్లాలో ఉన్నటువంటి వైద్యస్ ఆసుపత్రులను సందర్శించి ఆయా రికార్డులతో పాటు, సిబ్బంది తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ పర్యటనలో భాగంగ, ఆర్. బి. ఎస్. కె. కంటి పరీక్షల కార్యక్రమం, బీడీకే చిట్టిరామవరం కేంద్రంలో రికార్డుల తనిఖీ చేశారు.రామవరం ఎం సి హెచ్ కేంద్రంలోని ప్రత్యేక వైద్య విభాగాలను పరిశీలించారు.గోల్లగూడెంలో నిర్వహిస్తున్న మీజిల్స్ రుబెల్లా ఎం ఆర్ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.జిల్లాలోని పాలకొాయ తండా, నవభారత్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కంటి పరీక్షల కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల వివరాలు, పరీక్షల నిర్వహణ తీరు, కంటి సమస్యలను గుర్తించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారుల్లో కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించిన వెంటనే సంబంధిత వైద్య విభాగాలకు పంపించి, అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమం ద్వారా చిన్నారుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, వారికి తగిన వైద్య సహాయం అందించేందుకు వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి చిన్నారికి ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీడీకే చిట్టిరామవరం కేంద్రంలో రికార్డుల తనిఖీ అనంతరం బీడీకే చిట్టిరామవరం కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న అన్ని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు.అదేవిధంగా, ఇటీవల ఆ కేంద్రానికి సంబంధించి అందిన ఫిర్యాదులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశాలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సంబంధిత సిబ్బందితో చర్చించారు.ప్రజలకు అందించే వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడ పనిచేస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ డి ఈ ఐ సి, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ వ్యాక్సినేషన్ గదులను పరిశీలించారు.చిన్నారుల్లో అభివృద్ధి సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించే విధానాల గురించి సిబ్బందితో చర్చించారు. చిన్నారులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, ప్రత్యేక సంరక్షణ, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణలో అప్రమత్తత, సమయానుకూల వైద్య సేవలు, నాణ్యమైన సంరక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. అవసరమైన వైద్య సేవలను నిరంతరం అందిస్తూ, శిశువుల ఆరోగ్య పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు.ఇప్పటివరకు ఎటువంటి టీకా తీసుకోని చిన్నారులను గుర్తించి, వారికి టీకాలు అందించే కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అర్హులైన చిన్నారులను గుర్తించి, వారందరికీ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఏ చిన్నారి కూడా టీకా సేవలకు దూరంగా ఉండకూడదని, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ టీకాలు అందని చిన్నారులను గుర్తించాలని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.పాత కొత్తగూడెం పరిధిలోని గోల్లగూడెం ప్రాంతంలో నిర్వహిస్తున్న మీజిల్స్,రుబెల్లా నిర్మూలన ప్రచార కార్యక్రమం ప్రత్యేక టీకాల సెషన్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షించారు. మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అర్హులైన పిల్లలందరికీ టీకాలు అందించడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. టీకాలు అందని పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, టీకాల కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు.

టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అర్హులైన పిల్లల వివరాలను పరిశీలించి, ఎవరూ టీకాలకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే, టీకాల కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడం, టీకా వివరాలను నమోదు చేయడం, సెషన్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.మీజిల్స్, రుబెల్లా వంటి టీకాలతో నివారించగల వ్యాధుల నిర్మూలనలో ప్రతి ఆరోగ్య కార్యకర్త కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఈ పర్యటనలో భాగంగా డా. ప్రతాప్ వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును, వైద్య సేవల నిర్వహణను, రికార్డుల నిర్వహణను, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు అందించే వైద్య సేవల్లో నాణ్యతను పెంపొందించేందుకు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, కంటి పరీక్షలు, నవజాత శిశువుల సంరక్షణ, జీరో డోస్ టీకాల నిర్మూలన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి చిన్నారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య చికిత్సలు, టీకాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. వినోద్, నాగభూషణం, లలితతో పాటు సంబంధిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

-సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి

ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 29,అక్టోబర్ (వార్త సంధ్య)
భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని అశ్వారావుపేట ప్రాంతంలో పర్యటించిన ఆయన, పలు విద్యుత్ సబ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా విస్తరణ, నూతన కార్యాలయ భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, సర్వే, టెండర్ ప్రక్రియలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనసాగుతున్న పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అశ్వారావుపేట-2 పరిధిలోని నందమూరి కాలనీలో నిర్మిస్తున్న 220/132 , 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్ పనులను సీఎండీ పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానిక విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచాలని తెలిపారు.అశ్వారావుపేటలోని 220/132 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా వ్యవస్థ పటిష్టతకు మౌలిక సదుపాయాల పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదనపు 33 కెవి సామర్థ్య సరఫరా కొనసాగింపు పనుల పై దిశానిర్దేశం చేశారు.అదేవిధంగా 33/11 కేవీ నారాయణపురం సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు. అశ్వారావుపేటలో సుమారు 17 గుంటల విస్తీర్ణంలో ప్రతిపాదించిన నూతన డివిజన్ కార్యాలయ భవన స్థలాన్ని సీఎండీ పరిశీలించారు. కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఆసుపాక 400/220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులపై కూడా సీఎండీ సమీక్షించారు. ఈ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, సంబంధిత సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చేపట్టిన అన్ని పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులన్నింటినీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎండీ సూచించారు.

పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ పర్యటన సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో సీఎండీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రాంతంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, కార్యాలయ భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా మెరుగుదలకు సంబంధించిన అంశాలపై పరస్పరం చర్చించారు.విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవడం, సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని సీఎండీ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

క్రాప్ హాలిడే.. సర్కార్‌కు జాలీడేనా!

రైతు పంట వేయకపోతే అతని కుటుంబానికి అన్నం పెట్టేదెవరు? అప్పులు తీర్చేదెవరు? వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేదెవరు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రైతుకు క్రాప్ హాలిడే ప్రకటించే ముందు, రైతు కుటుంబానికి ఆదాయ భరోసా ప్రకటించాలి. సామాజిక మాధ్యమాల్లో రైతులు చేస్తున్న వ్యంగ్య వ్యాఖ్యలు ప్రభుత్వానికి ఒక సూటి ప్రశ్నను సంధిస్తున్నాయి. 'ముఖ్యమంత్రి గారూ! మీరు చెప్పినట్టు మేం ఆరు నెలలు పంట వేయకుండా ఉంటాం. కానీ మా మాట కూడా వినండి. మేం పంటలు వేయకుండా ఉంటే, ప్రభుత్వంలోని మీతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరూ ఆరు నెలల పాటు జీతాలు తీసుకోకుండా ఉండండి. అప్పుడు మా బాధ మీకు అర్థమవుతుంది' అని ఆవేశంతో ప్రశ్నిస్తున్నారు. రైతు జీవనాధారాన్ని వదులుకోవాల్సి వచ్చినప్పుడు, అతనికి ప్రత్యామ్నాయం ఏమిటన్న ప్రశ్న. ఉద్యోగికి జీతం ఆదాయం. రైతుకు పంట ఆదాయం. రైతు పెట్టుబడి పెట్టి, నెలల తరబడి శ్రమించి, పంట చేతికొస్తేనే డబ్బు సంపాదిస్తాడు. ప్రభుత్వం పంట వేయొద్దంటే అతని కుటుంబ పోషణ ఎలా సాగాలి? ఈ నష్టానికి పరిహారం ఎవరిస్తారు? మేడిగడ్డ నుంచి దిగువకు 734 టీఎంసీలు, కృష్ణా, గోదావరి నుంచి నిరాటంకంగా నీళ్లు కిందికి పోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న ప్రభుత్వానికి ఏ బాధ్యత లేదా? మేడిగడ్డ మీదుగా వంద రోజుల్లో 734 టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వెళ్లాయి. ఎల్లంపల్లి నుంచి జూన్-అక్టోబర్ 16 వరకు 17.69 టీఎంసీల నీరు దిగువకు విడుదలైంది. ఈ గణాంకాలు తెలంగాణ నీటి నిర్వహణపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గోదావరిలో ప్రవహించిన మొత్తం నీటిని నిల్వ చేయడం సాధ్యం కాకపోవచ్చు. కానీ బరాజ్‌ల భద్రత, నిల్వ సామర్థ్యం, పంపుల పనితీరు వంటి పరిమితులు ఉంటాయి. అయినప్పటికీ, అందుబాటులో ఉన్న నీటిని సాధ్యమైనంత మేరకు తాగు, సాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందించిందా? లేదా? అనేదే కీలకం.ప్రజలకు అవసరమైన నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సాంకేతికంగా సాధ్యమైన చర్యలను వేగంగా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతను కాపాడుతూనే నీటి వినియోగానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి. రాజకీయ వివాదాల మధ్య ప్రజాప్రయోజనాలు బలికాకూడదు.కృష్ణా జలాల విషయంలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం మరో కీలక ఉదాహరణ. ఈ ప్రాజెక్టులో ఐదు భారీ రిజర్వాయర్లు, పంపింగ్ వ్యవస్థలు సిద్ధంగా ఉన్నప్పటికీ, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించే కాలువలో 2.5 కిలోమీటర్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా మిగతా రిజర్వాయర్లకు నీటిని తరలించడంలో ఆటంకం ఏర్పడింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగు, తాగునీరు అందించాలన్నది లక్ష్యం. అలాంటప్పుడు కీలకమైన కాలువ పనులు సకాలంలో ఎందుకు పూర్తి చేయలేదు? నీటి కొరత తీవ్రతరం అవుతున్నప్పుడు అందుబాటులో ఉన్న నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకోలేకపోవడానికి కారణాలేమిటి? దీనికి సర్కార్ సమాధానం చెప్పాలి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని వినియోగించుకుంటున్న సమయంలో, తెలంగాణ ప్రాజెక్టుల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతుందా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఎల్ నినోను ఏ ప్రభుత్వం ఆపలేదు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించవచ్చు. జలాశయాల నిర్వహణ, పంటల ప్రణాళిక, తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం, తాగునీటి భద్రత, రైతులకు పరిహారం వంటి చర్యలు చేపట్టవచ్చు. కానీ అలా చేయకుండా ప్రభుత్వం ఈ అక్టోబర్‌లో తాగు, సాగునీరు, విద్యుత్తు సరఫరాపై సమీక్షలు నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. అయితే సమీక్షలు నిర్వహించడం ఒక ఎత్తు. ముందస్తు చర్యలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలయ్యాయన్నది మరో ఎత్తు. నీటిని నిల్వ చేసుకునే అవకాశాలు, ప్రాజెక్టుల పెండింగ్ పనులు, అంతర్రాష్ట్ర జలాల వినియోగం వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్ర నివేదిక ఇవ్వాలి. నీటి కొరత ఉన్నప్పుడు తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ రైతును ఆదాయం లేకుండా వదిలేయడం పరిష్కారం కాదు. పంట విరామం కోరితే ఆర్థిక సహాయం, ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు, మార్కెట్ భరోసా, పంటల బీమా, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలి. గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం నిర్వహణ, పాలమూరురంగారెడ్డి కాలువ పనులు, కృష్ణా జలాల వాటా వంటి అంశాలన్నింటిపై వాస్తవాలతో ప్రజలకు సమాధానాలు చెప్పాలి. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడంలో పాలకుల సామర్థ్యమే ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. పంటకు విరామం ఇవ్వాలని రైతును కోరే ప్రభుత్వం, జలవనరుల నిర్వహణపై కూడా లెక్కలు చెప్పాలి. రైతు తన ఆదాయాన్ని వదులుకోవాల్సి వస్తే, అతని కుటుంబాన్ని ఆదుకునే బాధ్యతను స్వీకరించాలి. ఎల్ నినో ప్రకృతి సృష్టించిన సంక్షోభం కావచ్చు. దానిని ఎదుర్కొనే సంసిద్ధత సర్కార్ బాధ్యత. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బతుకుతుంది. ఈ విషయాన్ని మర్చిపోతే రైతునే కాదు..యావత్ రాష్ట్రాన్నే కరువు కబళిస్తుంది!

ఇది ఎమర్జెన్సీ కాకుంటే మరేంటి?



దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ గురించి చరిత్రలో నమోదైన వాస్తవాలను తెలుసుకుంటే.. ఎంత ఘోరం అనిపిస్తుంది. సమకాలీన సమాజంలోని కొన్ని పరిస్థితులు, నాటి పరిణామాలతో పోలి ఉన్నట్టు కూడా తెలుస్తుంది. ఉదాహరణకు ఎమర్జెన్సీ కాలంలో పత్రికలు ఏ వార్త ప్రచురించాలన్నా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఉండేది. వార్తలు, సంపాదకీయాలు, ఫొటోలపైనా సెన్సార్‌షిప్ అమలైంది. ప్రభుత్వ విధానాలను విమర్శించిన జర్నలిస్టుల అరెస్టులు జరిగాయి. పాత్రికేయుల హక్కుల కోసం గొంతెత్తే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ)ను కూడా రద్దు చేశారు. ప్రభుత్వానికి నచ్చని వార్తలు ప్రజలకు చేరకుండా అడ్డుకోవడమే అప్పటి పాలకుల ఉద్దేశం. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అని అభివర్ణించే మీడియా గొంతు నొక్కిన చరిత్ర అది. ఇప్పుడు కూడా అదే తరహా అధికార కేంద్రీకరణ, సమాచారంపై నియంత్రణకు దారితీసే విధానాలను మోదీ సర్కార్ మెల్లగా పట్టాలెక్కిస్తున్నట్టు కనిపిస్తున్నది. నాటి ఎమర్జెన్సీకి, ప్రస్తుత వివాదాస్పద చట్టానికి తేడాలు ఉన్నప్పటికీ స్థూలంగా మీడియా స్వేచ్ఛపై వాటి ప్రభావం మాత్రం ఒకేలా ఉండొచ్చనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం-2023 ప్రకారం 2025లో నిబంధనలు జారీ చేసింది. ఇందులో పలు వివాదాస్పద అంశాలను పేర్కొన్నది. ఏదైనా వార్తను ప్రచురించాల్సి, ప్రసారం చేయాల్సి వస్తే డీపీడీపీ చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వంలోని, ప్రభుత్వం బయట ఉన్న బడాబాబుల గురించి వార్తలు రాయాలంటే వారు అనుమతి ఇస్తారా? పాలకుల అవినీతిని బయటపెడుతామంటే పాలకులు ఒప్పుకొంటారా? అక్రమార్కుల గురించి అత్యంత విశ్వసనీయవర్గాలు సమాచారం సమకూర్చుతుంటాయి. ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వం పచ్చజెండా ఊపిన వార్తలే ప్రచురితం అయ్యేవి. ఇప్పుడు కూడా సంబంధిత వ్యక్తుల అనుమతి తీసుకోవాలి అనే నిబంధన అప్రకటిత ఎమర్జెన్సీ విధానం కాదా? డీపీడీపీ చట్టంలో మీడియాకు మినహాయింపులు కల్పించాల్సిన అవసరమున్నది. డీపీడీపీ నిబంధనలను సవాల్ చేస్తూ డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) ఆధ్వర్యంలో 21 మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వ్యాజ్యంపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహన ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్రంలోని సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. ప్రజాస్వామ్యంలో ప్రసార మాధ్యమాల బాధ్యత కేవలం సాధారణ సమాచారానికి సంబంధించిన వార్తలను ప్రచురించడం మాత్రమే కాదు. అధికారంలో ఉన్న వారి నిర్ణయాలను ప్రశ్నించడం, అవినీతిని బయటపెట్టడం, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన ధనాన్ని పాలకులు దుర్వినియోగం చేస్తే నిలదీయడం. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడటం. ప్రజలకు తెలుసుకునే స్వేచ్ఛ ఉంటుంది, మీడియాకు తెలియజెప్పే స్వేచ్ఛ ఉంటుంది. డీపీడీపీ నిబంధనలు-2025 ప్రకారం వ్యక్తుల వ్యక్తిగత డిజిటల్ గోప్యతను రక్షించాలి. ఆ పేరుతో ప్రజాప్రయోజనాలకు సంబంధించిన పరిశోధనాత్మక జర్నలిజం సంగతేంటి? అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలపై వార్తలు రాయడానికి, బాధ్యులైన వ్యక్తులు అనుమతి ఇస్తారా? అది ఎంత హాస్యాస్పదం! ఈ నిబంధనలు ఎటుదారి తీస్తాయో ఆలోచిస్తే ఆందోళన కలుగుతుంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి, ప్రజాధనానికి ధర్మకర్తలుగా ఉండాల్సిన వాళ్లు.. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే మీడియా కచ్చితంగా ఆ విషయాలను ప్రజల ముందు పెడుతుంది. అందులో ఎవరి వ్యక్తిగతం ఏముంటుంది? పబ్లిక్ ఆఫీస్‌లో వ్యక్తిగత గోప్యత అంటే ఎట్లా? ఉదాహరణకు ఎవరైనా ఓ ముఖ్యమైన నేత సోదరుడి ఇల్లు చెరువు బఫర్ జోన్‌లో ఉన్నదనే వార్తను ప్రచురించాలి అనుకుందాం. ఆ ఇంటి ఫొటోను ప్రచురిస్తే వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగినట్టా? అలా అనే పరిస్థితి వస్తుందా? అసలు 'వ్యక్తుల వ్యక్తిగత గోప్యత' అంటే నిర్వచనం ఏంటి? పాలకుల విచక్షణనే నిర్వచనమైతే, అధికార పార్టీ సూచనలే ఆదేశాలైతే అరాచకం రాజ్యమేలుతుంది. జర్నలి స్టులు వార్తలు రాయలేని దుస్థితి తలెత్తుతుంది? ఏదైనా అంశంపై వార్తను ప్రచురిస్తామని, ప్రసారం చేస్తామని సంబంధిత వ్యక్తులకు ముందే సమాచారం ఇస్తే.. అది ఎటు దారి తీస్తుంది? ఆధారాలను మాయం చేయరా? సాక్షులను ప్రభావితం చేయరా? వార్త ప్రచురణకు ఆటంకాలు కలిగించరా? సరే, ప్రజాప్రయోజనం లేకుండా, ఏమైనా తప్పుడు వార్తలు ప్రచురిస్తే, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకోవడానికి చట్టాలు లేవా? మళ్లీ ఎందుకు కొత్త కొత్త నిబంధనల ముసుగులో ఎమర్జెన్సీ మాడల్ సెన్సార్‌షిప్..? డీపీడీపీ నిబంధనల పరిధి నుంచి మీడియాను మినహాయించాల్సిన అవసరమున్నది. మీడియా వ్యక్తుల వ్యక్తిగత సమాచార వ్యాప్తిలో స్వీయ నియంత్రణ పాటించాలి. హద్దులు దాటితే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాలి. ఇందుకు ఇప్పటికే చట్టాలు ఉన్నాయి. కొత్త ఆంక్షలెందుకు?

డీపీడీపీ చట్టం పరిధిలో ఏర్పాటు చేసే డిజిటల్ డాటా ప్రొటెక్షన్ బోర్డు స్వతంత్రత, అధికారాలు కూడా వివాదాస్పదంగానే ఉన్నాయి. సదరు బోర్డు న్యాయస్థానం పాత్రను పోషిస్తే.. పాలనా వ్యవస్థ కోర్టుల అధికారాల్లోకి చొరబడినట్టు కాదా? డీపీడీపీ చట్టం సమాచార హక్కు చట్టంలోనూ కీలక సవరణ చేసింది. అందుకే ఇది 'మోదీ మార్క్ ఎమర్జెన్సీ' అని, 'కొంపదీసి ఎమర్జెన్సీ విధిస్తరా ఏంది!' అనీ విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికే దేశంలో ప్రశ్నించే గొంతుకలపై ఆంక్షలు పెరిగాయి. విద్యార్థుల నిరసన ప్రదర్శనను అడ్డుకోవడానికి కూడా సాయుధ బలగాలను మోహరిస్తున్నారు బీజేపీ పాలకులు. ఈ నేపథ్యంలో మీడియా స్వేచ్ఛను కూడా హరించడం మరింత ఆందోళనకరం. మీడియా స్వేచ్ఛను కోల్పోవడం అంటే కొందరు జర్నలిస్టులు హక్కులను కోల్పోవడం కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అవసరమైన సమాచారాన్ని మీడియా ద్వారా పొందే అవకాశాన్ని ప్రజలు కోల్పోవడం. మరోవైపు డీఎన్‌పీఏ ప్రతినిధుల వినతిపత్రంపై నెలల తరబడి స్పందించని కేంద్ర ప్రభుత్వ పెద్దలు... సుప్రీంకోర్టు నోటీసులతో ఉలిక్కిపడి మేల్కొన్నారు. డీపీడీపీ చట్టం మీడియా హక్కులను హరించబోదని, మీడియాకు రాజ్యాంగం రక్షణలు కల్పించిందని ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం అన్నారు. మరి భావప్రకటనా స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ)ను ఉల్లంఘిస్తూ చట్టం తీసుకొస్తే అది సమంజసమేనా? మొత్తం వ్యవహారంపై సుప్రీం కోర్టు తీర్పు ఎలా ఉంటుందో అనేది వేచి చూడాలి.

ఎక్కడ తగ్గాలో కాంగ్రెస్ గ్రహిస్తేనే..

మితిమీరిన కోరికలు వ్యక్తం చేస్తే 'ఆశకు హద్దుండాలి, మోహానికి సిగ్గుండాలి' అని మందలిస్తుంటారు. కానీ, కాంగ్రెస్‌ను మందలించేవారెవరు? మందలించకుంటే మరి కాంగ్రెస్ బాగుపడేదెలా? కాంగ్రెస్ బాగుపడకుండా దేశంలో ప్రతిపక్షమైన 'ఇండియా కూటమి' ఎన్నికల్లో మెరుగుపడేదెలా? సమకాలీన రాజకీయాలపై కనీస అవగాహన ఉన్నవారెవరికైనా దేశంలో అతిపెద్ద జనాభా రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయాల్ని గమనిస్తే ఈ ప్రశ్నలు తలెత్తక మానవు. ఎందుకంటే, కాంగ్రెస్ అలా ప్రవర్తిస్తోంది. 403 నియోజకవర్గాలున్న యుపి అసెంబ్లీ ఎన్నికల పొత్తుల్లో కాంగ్రెస్ తనకు 200 సీట్లు కావాలంటోంది. పొత్తు కుదురుతుందా? బెడుస్తుందా? అన్నది ఇకపై కాంగ్రెస్ వ్యవహరించే తీరుపైనే ఆధారపడనుంది. కిందటి (2022) ఎన్నికల్లో కాంగ్రెస్ గొంతెమ్మ కోరికలకు సమాజ్‌వాదీ పార్టీ ససేమిరా అంటే, అలిగి, వేర్పడి పోటీ చేసింది. మిగతా 'అమాం బాపతు' పార్టీలను కలుపుకొని 'యుపిఏ' కూటమిగా పోటీ చేసి బొక్కబోర్లా పడింది. 399 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్‌కు రెండంటే రెండే అసెంబ్లీ స్థానాలు దక్కాయి. యుపిలో మా పార్టీకున్న సంస్థాగత బలం, ఇటీవల పెరిగిన మా నాయకుడు రాహుల్ గాంధీ ఇమేజ్ ప్రాతిపదికన మాకు 'గౌరవప్రదమైన' స్థానాలు ఇవ్వాల్సిందే' అని ఏఐసిసి నాయకుడు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్జి రాజేంద్ర పాల్ గౌతమ్ అంటున్నారు. ఇది ఎస్‌పి నాయకత్వానికి నచ్చట్లేదు.

వారి ఓటమి అందరికీ నష్టం

ఉత్తరాది రాష్ట్రాల పొత్తుల్లో కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి (సక్సెస్ రేట్) తక్కువగా ఉండటం ఇతర భాగస్వామ్య పార్టీల అవకాశాలను దెబ్బతీస్తోంది. పొత్తు చర్చల్లో గీచి గీచి బేరాలు చేసి ఎక్కువ సీట్లు తీసుకోవడం, తక్కువ సీట్లు నెగ్గడం కాంగ్రెస్‌కు రివాజయింది. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాఘట్ బంధన్' తరపున తేజస్వీ యాదవ్ (ఆర్‌జెడి) ముఖ్యమంత్రి కాకుండా పోవడానికి కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి తక్కువగా ఉండటమే కారణమన్నది ఎవరూ కాదనలేని సత్యం. 243 స్థానాల అసెంబ్లీలో 122 మ్యాజిక్ నంబర్. కూటమి 110 స్థానాల వద్ద వచ్చి ఆగింది. పోటీ చేసిన 144లో 75 ఆర్‌జెడి గెలిస్తే 19లో 12 సిపిఐ (ఎంఎల్), 6లో 2 సిపిఐ, 4లో 2 సిపిఎం నెగ్గాయి. కానీ, బెట్టుచేసి 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 చోట్ల మాత్రమే నెగ్గింది. ఇటువంటి అనుభవాలు ఉత్తరప్రదేశ్‌లోనూ తక్కువేమీ లేవు. అందుకే, కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాల్నిబట్టి స్థానాలు ఇస్తాం తప్ప వారి కోరినన్ని కాదు అన్నది ఎస్‌పి నాయకత్వ భావన.

2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ, బిజెపిని మానసికంగా ఎంతో కృంగదీసే ఫలితాలు ఇండియా కూటమి సాధించినప్పుడు కూడా కాంగ్రెస్ విజయశాతం తక్కువే! 62 చోట్ల పోటీ చేసిన ఎస్‌పి 37 చోట్ల (సగానికి పైగా) నెగ్గితే, 17 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 6 స్థానాల్లో (దాదాపు మూడో వంతు స్థానాల్లో)నే నెగ్గింది. ఎస్‌పి మెరుగైన ఫలితాలు సాధించడం వల్లే మొత్తానికి కూటమికి ఎన్‌డిఏ పక్షాల పైన ఆధిపత్యం (43/80) దక్కింది. 'ఎక్కువ సీట్లు తీసుకొని బలహీనమైన అభ్యర్థుల్ని కాంగ్రెస్ నిలబెడితే ప్రత్యర్థులకు మేలు జరుగుతుంది. దాని వల్ల కాంగ్రెస్‌కు, ఎస్‌పికి మాత్రమే కాదు, మొత్తం ఇండియా కూటమికే తీరని నష్టం' అని పార్టీ నాయకులతో ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన, ఇన్ని సీట్లు కావాలి అనకుండా, ముందు ఎక్కడెక్కడ 'గెలువదగ్గ అభ్యర్థులు'న్నారో జాబితా ఇమ్మని కాంగ్రెస్ వారిని అడుగుతున్నారు. దాన్ని బట్టి కాంగ్రెస్‌కు ఎన్ని స్థానాలు ఇవ్వొచ్చన్నది నిర్ణయించాలని ఎస్‌పి భావిస్తోంది.

80 కి దిగువనో, పైనో..

'సీట్ల సంఖ్యపై బెట్టు కాదు గానీ, పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం, గట్టి అభ్యర్థులు ఎక్కడున్నారో చెబుతూ చర్చల ప్రక్రియ ప్రారంభిద్దాం' అని పార్టీ వర్గీయులతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వదేరా అన్నట్టు వార్తలొచ్చాయి. అక్టోబరు 19న ప్రియాంక సమక్షంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరాధన మిశ్రా, ఇటీవలే పార్టీ రాష్ట్ర 'వర్కింగ్ ప్రెసిడెంట్'గా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్ మసూద్ (శహరాన్‌పూర్ ఎంపి), రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్జి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. చర్చల ప్రక్రియ నిర్మాణాత్మకంగా, సయోధ్య పూరితంగా ఉండాలని ఆమె వారికి సూచించారు. కానీ, బయట అందుకు భిన్నంగా 'సమాన గౌరవం సమాన వాటా' అనే వాదాన్ని ఇమ్రాన్ మసూద్ ఎత్తుకున్నారు. '150 అని ఎవరన్నారు? నా అంచనాల్లో మాకు 200 స్థానాలు ఇవ్వాల్సి ఉంటుంది' అని ఒక మీడియా సమావేశంలో ఇంచార్జ్జి రాజేంద్రపాల్ గౌతమ్ అనటాన్ని ఎస్‌పి నాయకులు తప్పుబడుతున్నారు.చర్చల ప్రక్రియ ఓ కొలిక్కి రాకుండానే సీట్ల సంఖ్య, నిర్దేతుకమైన డిమాండ్లను మీడియాలో చెప్పుకోవడం సరికాదన్నది వారి వాదన. అంతకు ముందు, అక్టోబర్ 13న రాహుల్ గాంధీ వద్ద జరిగిన 'చాయ్ భేటీ'లో ఎస్‌పి సీనియర్ ఎం.పి రాజీవ్‌రాయ్ ఒక మాట ప్రియాంకకు చెప్పారు. 'ఇన్ని నియోజకవర్గాలు అనే లెక్క -జాబితా కాదు గానీ, గెలుపు అవకాశాలు గల అభ్యర్థులు కాంగ్రెస్‌కు ఎక్కడెక్కడ ఉన్నారు, వారి పేర్లతో జాబితా ఇవ్వండి' అని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించింది. 'అలా ఎవరైనా ముందే జాబితా ఇస్తారా? దేశంలో ఎక్కడా జరుగదు. ముందు నియోజకవర్గాలు తేలాలి' అన్నది కాంగ్రెస్ ఆలోచనగా ఉంది. లోగడ ఒక ఎన్నికలో కూటమి తరపున తాను స్వయంగా ప్రచార బరిలో దిగుతానని ప్రియాంక గాంధీ మాటిస్తే, వంద స్థానాలు కాంగ్రెస్‌కు ఇచ్చి భంగపోయిన అనుభవం ఎస్‌పిది. సీట్లు కేటాయించిన తర్వాత ఎన్నిమార్లు ఫోన్ చేసినా సదరు నాయకురాలు స్పందించనే లేదని ఎస్‌పి సమావేశాల్లో అఖిలేశ్ యాదవ్ స్వయంగా వెల్లడించారు. 2022 ఎన్నికల్లో 'మై లడికీ హూ, లడ్ సక్తీ హూ' అని ప్రియాంక ప్రచారం చేసినా ఫలితాలు మాత్రం (2/399) ఘోరంగా వెక్కిరించాయన్నది ఎస్‌పి వర్గాల ఆవేదన. అందుకే, కాంగ్రెస్‌కు ఇచ్చేవి 60- 80 స్థానాల మధ్య ఎక్కడో గిరి గీయాలన్నది వారి ఆలోచన. బెట్టు చేసి, బేరమాడి 80 -100 మధ్య ఏదో సంఖ్యను ఖరారు చేసుకోవాలని కాంగ్రెస్ తాపత్రయం.

ఉమ్మడి లక్ష్యమే వారిని కట్టివుంచాలి

ఎటు తిరిగి ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలనే ఉమ్మడి లక్ష్యమే ఎస్‌పి, కాంగ్రెస్‌ను కట్టిపడేసేది. యుపిలో కూట మి పెద్దన్నగా ఎస్‌ఫి అధినేతకు 'పెద్దమనసుండాల'ని కాంగ్రెస్ వాదులు చెబుతున్నా 'ఇండియా కూటమి' దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీయే 'ఇచ్చిపుచ్చుకునే ధోరణి'తో ఉండాలని ఎస్‌పి వర్గాలంటున్నాయి. పొత్తుల్లో తమకు కేటాయించమని కాంగ్రెస్ వారు ప్రతిపాదించే 180 స్థానాల జాబితాలో, 12 ఎస్‌పి సిట్టింగ్ ఎంఎల్‌ఏ స్థానాలుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. ఇదేనా పొత్తు పద్ధతి? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి 36 శాతం ఓటు వాటాతో 111 స్థానాలు సొంతంగా నెగ్గింది. 55 స్థానాల్లో బిజెపి 5వేల లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచింది. 5వేల వరకు వ్యత్యాసపు సీట్లు 23, 3వేల లోపువి 3, 2వేల లోపువి 11, వెయ్యిలోపువి 11, 500లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచిన స్థానాలు 7, ఇలా మొత్తం 55 ఉన్నాయి. ఈ గణాంకాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, గత పదమూడేళ్లలో ఇప్పుడే బిజెపికి ఎదురవుతున్న అత్యధిక వ్యతిరేకత... వీటన్నిటిని సానుకూలంగా మలచుకోవడానికి ముందు కావాల్సింది యుపిలో ఎస్‌పికాంగ్రెస్ మధ్య సయోధ్య!

వార్తసంధ్య
www.vaarthasandhya.com

డ్రోన్ పిచికారీతో సమయం, శ్రమ ఆదా

-రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : ఏడీఏ వసంత సుగుణ

బచ్చన్నపేట, (వార్త సంధ్య) అక్టోబర్ 29.
రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సాగు ఖర్చులను తగ్గించుకోవాలని జనగామ ఏడీఏ వసంత సుగుణ సూచించారు. బుధవారం బచ్చన్నపేట మండలంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ పిచికారీ ప్రదర్శనలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వరి పొలంలో నానో యూరియా, పత్తి పొలంలో వేప నూనెను డ్రోన్ల ద్వారా పిచికారీ చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డ్రోన్ల వినియోగంతో పిచికారీకి పట్టే సమయం, శ్రమ తగ్గడంతో పాటు రైతులకు ఆరోగ్య భద్రత కూడా లభిస్తుందని తెలిపారు. నానో యూరియా, వేప నూనె వినియోగం పంటల సంరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దివ్య, సర్పంచ్ అల్వాల్ నరసింహారావు, వ్యవసాయ విస్తరణాధికారి రాజేష్, ఆత్మ కమిటీ సభ్యులు, కృషి సఖీలు, రైతులు పాల్గొన్నారు.

కొడవటూర్ సిద్ధుల గుట్ట ఆలయ అభివృద్ధికి కృషి

-నిధుల కేటాయింపునకు సమస్యలు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం
-బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ మసూద్

బచ్చన్నపేట, (వార్త సంధ్య) అక్టోబర్ 29.
కొడవటూర్ సిద్ధుల గుట్ట స్వయంభూ సిద్ధేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు కోసం కృషి చేస్తామని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ మసూద్ తెలిపారు. ఆలయ సమస్యలను జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనులు ముందుకు సాగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దేవస్థాన చైర్మన్ ఈదులకంటి వెంకటరెడ్డి, పాలక మండలి సభ్యులు మొహమ్మద్ మసూద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నెలకొన్న సమస్యలు, సిద్ధుల గుట్ట అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అవసరమైన నిధుల కేటాయింపు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొహమ్మద్ మసూద్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేలా సంబంధిత నాయకులతో చర్చిస్తానని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దతరపు నరేష్, దేవస్థాన పాలక మండలి సభ్యులు పుట్ట నర్సిములు, చిక్కుడు మల్లేశం, జ్యోతి ఉమాపతి, జలెందేర్, దాచేపల్లి రాజయ్య, ఏలికట్టే శాంతయ్య, సందీప్, ప్రభాకర్, కృష్ణమూర్తి, నాయకులు బొట్టు గణపతి, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం పేరుతో వసూళ్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

-డీజీపీకి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ వినతి


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

హైదరాబాద్, (వార్త సంధ్య) అక్టోబర్ 29.
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పేరును దుర్వినియోగం చేస్తూ, ఎఫ్ఐఆర్ కాపీలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్న వారిపై, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పిలుపునిస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ డీజీపీ ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. గత తొమ్మిదేళ్లుగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం రాజ్యాంగబద్ధంగా తమ ఫోరం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. అయితే, 2026 జనవరిలో కొంతమంది వ్యక్తులు తమ ఫోరం పేరుతోనే మరో సంఘాన్ని రిజిస్టర్ చేశారని ఆరోపించారు. ఆ సంఘం పేరుతో అసెంబ్లీ, సచివాలయం, కలెక్టరేట్, ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి పిలుపునిస్తున్నారని తెలిపారు. ఈ పిలుపుల కారణంగా అసలైన తెలంగాణ ఉద్యమకారుల ఫోరానికి చెందిన నాయకులు, నాయకురాళ్లు పోలీసుల అరెస్టులకు గురవుతున్నారని, దీంతో తమ సంఘం ప్రతిష్ట దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ కేంద్రంగా ఎఫ్ఐఆర్ కాపీలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు దిశ పత్రికలోనూ ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై గత మే నెలలోనే డీజీపీకి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పిలుపునిస్తున్న వారితో, ఎఫ్ఐఆర్ కాపీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారితో తమ తొమ్మిదేళ్ల చరిత్ర కలిగిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

రాత్రివేళ దోపిడీకి పాల్పడిన ముఠా ముగ్గురు అరెస్ట్, ఒక బాలుడి పట్టివేత

వార్త సంధ్య కూకట్‌పల్లి :
అర్ధరాత్రి వేళ ఒంటరిగా వెళ్తున్న యువకుడిని అడ్డుకుని దోపిడీకి పాల్పడిన ముఠాను కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు ఒక బాల నిందితుడి (సీసీఎల్)ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 28న తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో కేపీహెచ్‌బీ డీ–ఫిన్ హాస్టల్‌లో ఉంటూ డేటా సైన్స్ కోచింగ్ తీసుకుంటున్న షేక్ గనీ అనే యువకుడు భోజనం చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా, మలేషియన్ టౌన్‌షిప్ బస్‌స్టాప్ వద్ద ఆటోలో వచ్చిన కొందరు వ్యక్తులు అతడిని అడ్డుకున్నారు. బాధితుడిని బెదిరించి, దాడి చేసి బలవంతంగా ఫోన్‌పే ద్వారా రూ.6,000 బదిలీ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 309(6) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఎస్. అనిల్ (గ్రాజ 9552), కె. శ్రీనివాసరావు (గ్రాజ 757) సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. పోలీసు బృందం నెక్సస్ మాల్ సమీపంలో దాడి చేసి కూకట్‌పల్లికి చెందిన వల్లేటి రాజేష్ (24), బోయిన బాలరాజు (29), కోనతం మణికంఠ (26)లతో పాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకుంది. నిందితుల నుంచి 5 మొబైల్ ఫోన్లు మరియు నేరానికి ఉపయోగించిన ఆటో రిక్షా (౧+ 34 ౧ 3870)ను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన కానిస్టేబుళ్లు అనిల్, శ్రీనివాసరావుతో పాటు క్రైమ్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

మలేషియాలో ఉద్యోగం పేరిట లక్షల రూపాయల మోసం: కేపీహెచ్‌బీ 'బెల్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' గుట్టురట్టు

వార్త సంధ్య కూకట్‌పల్లి :
మలేషియాలో డేటా ఎంట్రీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన ఘటన హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నాయిడుపేటకు చెందిన నారేడ్ల బాలగంగాధర్ రావు (36)కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కేపీహెచ్‌బీ కాలనీలోని మంజీరా ట్రినిటీ కాంప్లెక్స్‌లో 'బెల్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' పేరుతో కన్సల్టెన్సీ నడుపుతున్న బల్లె నరేష్ పరిచయమయ్యాడు. మలేషియాలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో, బాలగంగాధర్ రావు అక్టోబర్ 2న సదరు ఆఫీసుకు వెళ్లాడు. అక్కడ నరేష్‌తో పాటు జగవీర్ పిళ్లెలా అనే వ్యక్తి అతడి నుంచి రూ.2,42,000 నగదుతో పాటు విద్యార్హతల ధృవీకరణ పత్రాలను తీసుకుని ఒప్పందం కుదుర్చుకున్నారు.
బాధితుడు వారి మాటలు నమ్మి అక్టోబర్ 12న మలేషియా చేరుకోగా, అక్కడ అతడిని స్వీకరించేందుకు ఎవరూ రాలేదు. అనంతరం ఒక ఏజెంట్ ఫోన్ చేసి, సింగపూర్ సరిహద్దు సమీపంలోని ఒక తెలియని ప్రాంతానికి రావాలని ఆదేశించి, అతడి పాస్‌పోర్ట్‌ను తన వద్దే ఉంచుకున్నాడు.
మోసపోయానని గ్రహించిన బాధితుడు స్వదేశానికి తిరిగి వెళ్తానని చెప్పగా, మరో రూ.3 లక్షలు ఇస్తేనే పాస్‌పోర్ట్ ఇస్తామని బెదిరింపులకు దిగారు. చివరకు ఏపీఎన్ఆర్‌టీఎస్ (ఘ్రాచీ=ూా) సహాయంతో బాలగంగాధర్ రావు అక్టోబర్ 25న క్షేమంగా భారత్ చేరుకున్నాడు.
ఇదే తరహాలో హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన తిరుపాల్ (31) అనే వ్యక్తి నుంచి కూడా సదరు కన్సల్టెన్సీ నిర్వాహకులు రూ.1,80,000 వసూలు చేసి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అక్టోబర్ 26న కేసు నమోదు చేసిన పోలీసులు, బల్లె నరేష్, జగవీర్ పిళ్లెలాపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

చట్టసభల్లో బీసీ కులాలకు ప్రాతినిధ్యం కరువు : జోర్రిగల శ్రీనివాస్

హైదరాబాద్, (వార్త సంధ్య) అక్టోబర్ 29.
స్వతంత్ర భారతంలో దశాబ్దాలుగా రాజకీయ పార్టీలకు ఓట్లు వేస్తున్నప్పటికీ, అనేక బీసీ కులాలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోర్రిగల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మేదరి, వడ్డెర, నాయీ బ్రాహ్మణ, కుమ్మరి తదితర కులాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో సుమారు 60 కులాలకు చెందిన ప్రజలు రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు, ఆధిపత్య కులాలతో పోటీ పడాల్సిన సవాళ్లు, రాజకీయ పార్టీల టికెట్ల కేటాయింపులో నిర్లక్ష్యం కారణంగా చిన్న బీసీ కులాలకు అవకాశాలు దక్కడం లేదన్నారు. కనీసం నామినేటెడ్, పార్టీ పదవుల్లోనైనా, ప్రజాప్రతినిధుల ఎంపికలోనైనా రాజకీయంగా వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం పొందని కులాలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మేదరి కులానికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలనే డిమాండ్‌ను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సంచార, అర్ధ సంచార, విముక్త జాతులతో పాటు రాజకీయంగా వెనుకబడిన బీసీ కులాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం మాత్రమే కాదని, పాలనలో భాగస్వామ్యం కావడం కూడా ముఖ్యమని శ్రీనివాస్ పేర్కొన్నారు. తమ డిమాండ్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, తరతరాలుగా రాజకీయ అవకాశాలకు దూరంగా ఉన్న కులాలకు న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. దానం కాకుండా హక్కులకు గుర్తింపు, హామీలు కాకుండా రాజకీయ ప్రాతినిధ్యంలో న్యాయం కావాలని ఆయన అన్నారు. గుర్తింపు, గౌరవం, అభివృద్ధి, అధికారం లక్ష్యంగా బీసీ, డీఎన్‌టీ కులాలకు న్యాయం జరిగే వరకు తమ డిమాండ్‌ను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ 12వ గ్రాడ్యుయేషన్ డే

-బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులకు అభినందనలు తల్లిదండ్రుల ఆనందోత్సాహం

దేవరకొండ, (వార్త సంధ్య) అక్టోబర్ 29.
దేవరకొండ పట్టణంలోని మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో 12వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరై ఆనందాన్ని పంచుకున్నారు.
ఈ సందర్భంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో పట్టభద్రులుగా నిలిచే రోజు ఎంతో కీలకమైనదని అన్నారు. డిగ్రీ విద్యను విజయవంతంగా పూర్తి చేసి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు తమ ప్రతిభకు నిదర్శనంగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో మరింతగా రాణిస్తూ తమ తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి గోల్డ్ మెడల్స్ అందించడం అభినందనీయమని, విద్యార్థులను ప్రోత్సహించడంలో గోల్డ్ మెడల్ డోనర్స్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ డే విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. కళాశాలలో విద్యను అభ్యసించి ప్రతిభను చాటిన విద్యార్థులు నేడు గోల్డ్ మెడల్స్ అందుకోవడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషి ఎంతో ఉందని, వారి ప్రోత్సాహం మరియు మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు ఉన్నత విజయాలను సాధిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ సీఓఈ డాక్టర్ జి. ఉపేందర్ రెడ్డి, గోల్డ్ మెడల్ సెక్రటరీ ఎం.జె.ఎఫ్. లయన్ ధనుంజయ సముద్రాల, సీపీడీసీ సెక్రటరీ ఎం.జె.ఎఫ్. లయన్ డాక్టర్ పెరుమాళ్ళ జాన్ శాంసన్, అలుమ్ని ప్రెసిడెంట్ ఎం.జె.ఎఫ్. లయన్ గాజుల రాజేష్, అలుమ్ని సెక్రటరీ లయన్ డాక్టర్ కేతన బోయిన మల్లికార్జున్, ఎం.జె.ఎఫ్. లయన్ పగిడిమర్రి రఘురాములు, పగిడిమర్రి రాధారాణి, లయన్ మోర భీష్మాచారి, ఇమ్మడి భద్రయ్య, రమావత్ శ్రీను, నెమ్మికంటి గౌరీశంకర్, బెజవాడ శేఖర్, పొనుగోటి జనార్ధన్, తదితర గోల్డ్ మెడల్ డోనర్స్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సీఓఈ లింగారెడ్డి, ఎన్‌సీసీ సీటీఓ నాగేందర్, డాక్టర్ ఎం. ప్రభాకర్, డాక్టర్ వి.మకట్లాల్, డాక్టర్ కె. రేణుక తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, ఉన్నత లక్ష్యాలను సాధించాలనే స్ఫూర్తిని నింపింది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

టపాసులను పూర్తిగా నిషేధించలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 వార్త సంధ్య
దీపావళి పండుగలో టపాసులను పూర్తిగా నిషేధించలేమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ప్రజలకు ఆనందం కలిగించే ఏ అంశాన్ని కూడా పూర్తిగా రూపుమాపలేమని.. కాకపోతే పండుగ సందర్భంగా వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని తెలిపింది.టపాసుల వల్ల కలిగే కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో పాటు కాలుష్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విరాట్ కోహ్లీ లాంటి ప్రముఖులను వినియోగించుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది. కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది.

పదేండ్ల వయసులోనే కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించాలి

-తద్వారా గుండె జబ్బుల ముప్పును ముందుగానే గుర్తించవచ్చు
-హెల్త్ సమ్మిట్‌లో నిపుణుల సూచన



న్యూఢిల్లీ, అక్టోబర్ 29 వార్త సంధ్య
గుండె జబ్బులు పెద్దవారికే వస్తాయనుకుంటే పొరబడినట్లే.. చిన్నారులు, యువతలోనూ గుండె సమస్యలు బయటపడుతున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ సేథ్ సూచించారు. పదేండ్ల వయసులో కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించడం ద్వారా గుండె జబ్బుల ముప్పును ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. గురువారం జరిగిన 'ఇండియా టుడే హెల్త్ సమ్మిట్-2026'లో ఈ విషయాలను వెల్లడించారు.ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ అశోక్ సేథ్ మాట్లాడుతూ కొందరు యువకులు అకస్మాత్తుగా మరణిస్తున్నారని, వారికి చిన్నప్పటి నుంచే గుర్తించని గుండె సమస్యలు ఉన్నట్లు బయటపడుతున్నదన్నారు. భారతదేశంలో సంభవించే గుండెపోటు కేసుల్లో సుమారు 50 శాతం 50 ఏండ్లలోపు వారిలోనే నమోదవుతున్నట్లు తెలుస్తున్నదన్నారు. గత 15 ఏండ్లలో గుండె జబ్బులు 200 శాతం పెరిగినట్లు తెలిపారు. అంతర్గత అవయవాల చుట్టూ పేరుకునే కొవ్వు ఇన్సులిన్ నిరోధకత, మధుమేహం, ఇతర జీవక్రియ సంబంధిత సమస్యల ముప్పును పెంచుతుందని డాక్టర్ అశోక్ సేథ్ వివరించారు.

నేడు ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 వార్త సంధ్య
ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని ఈ నెల 30న శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్నట్టు ఇస్రో చైర్మన్ నారాయణన్ గురువారం తిరుమలలో వెల్లడించారు. ఈ ప్రయోగం ద్వారా భారత నావిగేషన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా అర్ధరాత్రి 11.51 గంటలకు ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. భారత ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సేవల కొనసాగింపు కోసం, తర్వాతి తరం నావిగేషన్ సిస్టం కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఇది ప్రస్తుతం ఉన్న ఎల్5, ఎస్ సిగ్నళ్లతో పాటు అదనంగా ఎల్1 సిగ్నల్ సేవలను అందిస్తుంది. భారత్ భౌగోళిక పరిధితో పాటు, సరిహద్దుల అవతల 1500 కిలోమీటర్ల వరకు ఈ నావిగేషన్ సిస్టమ్ కవర్ చేస్తుంది.

నేడు సీఈసీపై 'ప్రజా అభిశంసన'



న్యూఢిల్లీ, అక్టోబర్ 29 వార్త సంధ్య
భారత ప్రధాన ఎన్నికల క ్ వి ు ష ్ న ం ్ జ్ఞానేశ్‌కుమార్‌పై ఈనెల 30న ఇండియా కూటమి నిర్వహించబోయే 'ప్రజా అభిశంసన' కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీర్మానం ఆమోదించడానికి ముందు ముగింపు ప్రసంగం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

మ్యాథ్స్, సైన్స్‌లో ఫెయిలైనా టెన్త్ పాస్!

-2028 పదో తరగతి పరీక్షల్లో సీబీఎస్ఈ కొత్త విధానం
-నైపుణ్య సబ్జెక్టుతో ఉత్తీర్ణతకు అవకాశం



న్యూఢిల్లీ, అక్టోబర్ 29 వార్త సంధ్య
2028లో జరిగే పదో తరగతి బోర్డు పరీక్షల విధానంపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక స్పష్టత ఇచ్చింది. పరీక్షల్లో విద్యార్థులు ఐదు తప్పనిసరి సబ్జెక్టులతోపాటు ఒక నైపుణ్య ఆధారిత సబ్జెక్టును ఎంచుకోవచ్చు. గణతం, సైన్స్ లేదా సాంఘిక శాస్త్రంలో ఫెయిలైనా.. అదనంగా ఎంచుకున్న స్కిల్ సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించడం ద్వారా పరీక్షలో పాస్ అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విధానం ప్రస్తుతం తొమ్మిదో తరగతి (2026-27 విద్యాసంవత్సరం) చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుంది. వీరు 2028లో పదోతరగతి బోర్డు పరీక్షలకు హాజరవుతారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ మార్పులు వర్తించవు.

ఐదు సబ్జెక్టులకు బోర్డు పరీక్షలు
కొత్త విధానం ప్రకారం విద్యార్థులు రెండు భాషలు, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం అనే ఐదు సబ్జెక్టులకు తప్పనిసరిగా బోర్డు పరీక్షలు రాయాలి. అయితే, మొత్తం తొమ్మిది తప్పనిసరి పాఠ్యాంశాలను అభ్యసించాల్సి ఉంటుంది. వీటిలో మూడో భాష, కళా విద్య, శారీరక విద్య, ఆరోగ్యం, వృత్తి విద్య కూడా ఉంటాయి.

నైపుణ్య విద్యకు రెండు మార్గాలు
వృత్తి విద్య తప్పనిసరి అయినప్పటికీ, విద్యార్థులు దాన్ని పూర్తి చేసేందుకు రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. మొదటిది కౌశల్ వికాస్. దీన్ని ఎంచుకున్న వారికి పాఠశాల స్థాయిలో అంతర్గత మూల్యాంకనం నిర్వహిస్తారు. కనీసం 33 శాతం మార్కులు సాధిస్తే పాఠశాల ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. రెండో మార్గంలో బోర్డు గుర్తించిన 22 నైపుణ్య సబ్జెక్టుల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్షియల్ మార్కెట్స్, హెల్త్‌కేర్ వంటి అంశాలు ఈ జాబితాలో ఉంటాయి. ఈ సబ్జెక్టును ఎంచుకున్న విద్యార్థులు పదో తరగతిలో సంబంధిత బోర్డు పరీక్ష రాయాలి. ఉత్తీర్ణులైన వారికి మార్కుల జాబితాలో మార్కులు, గ్రేడ్లను నమోదు చేయడంతోపాటు, నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఎస్‌క్యూఎఫ్) కింద నైపుణ్య ధ్రువీకరణ పత్రం కూడా అందజేస్తారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు సాధారణ పాఠ్యాంశాలతోపాటు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని బోర్డు భావిస్తున్నది.

కొన్ని పాఠ్యాంశాలకు మినహాయింపు
2026-27లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు 'ఇండివిడ్యూవల్స్ ఇన్ సొసైటీ' అనే అంతరశాస్త్ర పాఠ్యాంశం, కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాడ్యూళ్లు పాఠ్య ప్రణాళికలో ఉండవని సీబీఎస్ఈ స్పష్టంచేసింది. అలాగే 2027-28లో పదో తరగతి చదివే ఈ బ్యాచ్‌కు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ కూడా వర్తించదు. పాఠ్య ప్రణాళిక అమలు షెడ్యూల్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు తెలిపింది. విద్యా, పరీక్షల విధానంపై ముందుగానే స్పష్టత ఇవ్వడం ద్వారా విద్యార్థులు పరీక్షలకే పరిమితం కాకుండా అర్థవంతమైన అభ్యాసంపై దృష్టిపెట్టేలా చేయడమే లక్ష్యమని బోర్డు వర్గాలు తెలిపాయి.

నిరసనను వాయిదావేసే ప్రసక్తే లేదు, ర్యాలీ నిర్వహించి తీరుతాం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 **వార్త సంధ్య**
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదావేసే ప్రసక్తేలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)' ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్‌గాంధీని కోరాయి. పెద్దఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతోపాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టంచేశారు. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తంచేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.

హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో కుట్ర!

-2 రోజుల ముందే యూనస్‌తో విద్యార్థి నేతల రహస్య చర్చలు
-సహకరించిన ఏఎఫ్‌పీ జర్నలిస్టు
-యూనస్ మాజీ ప్రెస్ సెక్రటరీ సంచలన ఆరోపణలు

ఢాకా: వార్త సంధ్య
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అధికార పీఠం నుంచి దింపే ప్రణాళిక ఆమె దేశం విడిచి పారిపోవడానికి రెండు రోజుల ముందే సిద్ధమైందని ఆ దేశ మాజీ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ మాజీ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం సంచలన ఆరోపణలు చేశారు. 2024 ఆగస్టు 5న హసీనా దేశం విడిచివెళ్లకముందే విద్యార్థి నేతలు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్‌ను తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అక్టోబర్ 29న ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టులో పలు కీలక విషయాలను తెలియజేశారు. విద్యార్థి నేతలకు, యూనస్‌కు మధ్య సంబంధాలు ఏర్పరచడంలో ఏజెన్స్ ఫ్రాన్స్-ప్రెస్(ఏఎఫ్‌పీ) జర్నలిస్టు ఖాదరుద్దీన్ షిషిర కీలక పాత్ర పోషించారని ఆలం పేర్కొన్నారు. అప్పట్లో ఆయన ఏఎఫ్‌పీ ఢాకా ఫ్యాక్ట్‌చెక్ బృందానికి సంపాదకునిగా పనిచేశారు. అధికార మార్పిడి గురించి కొద్దిమంది విశ్వసనీయ వ్యక్తులకు మాత్రమే తెలుసని ఆలం పేర్కొన్నారు. హసీనా భద్రతా వ్యవస్థకు ఈ పరిణామాల గురించి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. విషయం బయటపడితే ఏఎఫ్‌పీ బృందం మొత్తం రహస్య నిర్బంధ కేంద్రంలో చిక్కుకునే ప్రమాదం ఉండేదన్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో సామూహిక హత్యలు, అపహరణలు జరిగాయని ఆయన ఆరోపించారు. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన అనంతరం ఆగస్టు 8న యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. హసీనా పరారీని వీడియో తీసిన బంగ్లా మాజీ అధికారి అనుమానాస్పద మృతి

ఒక రోజు క్రితం అదృశ్యమైన బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్ మాజీ అధికారి కేఎం తహసి శౌరీ అనుమానాస్పద స్థితిలో నదిలో శవమై కన్పించారు. డెయిలీ స్టార్ కథనం ప్రకారం.. విద్యార్థుల నిరసనతో అప్పటి ప్రధాని షేక్ హసీనా 2024, ఆగస్టు 5న దేశం వదిలి సైనిక హెలికాప్టర్‌లో పారిపోతున్న వీడియోను శౌరీయే రికార్డు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే తాను ఆ వీడియోను కేవలం షేర్ మాత్రమే చేశానని ఆయన అప్పట్లో పేర్కొన్నారు.

భవిష్యత్తులో డబ్బు దాచుకోవడం వృథా

-ఏఐతో అపారమైన సంపద
-ఎలాన్‌మస్క్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ వార్త సంధ్య
కృత్రిమ మేధస్సు(ఏఐ), రోబోట్ల అభివృద్ధి వల్ల భవిష్యత్తులో ప్రపంచం అపారమైన సమృద్ధితో నిండిపోతుందని, అందువల్ల సుదూర భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేయడం నిరర్థకమని ప్రముఖ వ్యాపారవేత్త, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. ఏఐ సాంకేతికతలో పురోగతి వల్ల వస్తువులు, సేవలు విస్తృతంగా అందుబాటులోకి వస్తాయని ఆయన చాలాకాలంగా చెప్తున్నారు. భవిష్యత్తులో సమృద్ధి అపారంగా పెరిగిపోతుందనే ఆశతో ప్రస్తుతం తీసుకుంటున్న కొన్ని ఆర్థికపరమైన తప్పుడు నిర్ణయాలను సమర్థించుకోవచ్చా?అంటూ ఓ వినియోగదారుడు సరదాగా చేసిన వ్యాఖ్యకు మస్క్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'అత్యంత తెలివైన సాంకేతికతతో అపారమైన సమృద్ధి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సుదూర భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేయడం నిరర్థకం' అని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, మనుషుల ఆకారంలో ఉండే రోబోట్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చగలవని ఆయన పలుమార్లు అభిప్రాయపడ్డారు. 2036 నాటికి డబ్బుకు ప్రాధాన్యం లేకుండా పోవచ్చని ఆయన అన్నారు. ఏఐ, రోబోట్లు ప్రజలు వినియోగించగలిగిన దానికంటే ఎక్కువ వస్తువులు, సేవలను ఉత్పత్తి చేయగలవని ఆయన వివరించారు.

మస్క్ ఎందుకు ఇలా భావిస్తున్నారు?
ప్రస్తుతం ప్రజలు ఆహారం, ఇండ్లు, రవాణా, వినోదం వంటి నిత్యావసరాలు, సేవల కోసం ప్రధానంగా డబ్బుపైనే ఆధారపడుతున్నారు. భవిష్యత్తులో ఏఐ, రోబోట్లు ఈ వస్తువులను ప్రజల అవసరాలకు మించి ఉత్పత్తి చేయగలిగితే, వాటి లభ్యత పెరిగి, ఖర్చులు తగ్గవచ్చని మస్క్ భావిస్తున్నారు. అప్పుడు నేటి సమాజంలో డబ్బుకు ఉన్న ప్రాధాన్యం గణనీయంగా తగ్గిపోవచ్చన్నది ఆయన వాదన.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

'కల్ట్' ట్రైలర్ రిలీజ్..

-రక్తపాతం, భయంకరమైన హత్యలతో విశ్వక్ సేన్ విశ్వరూపం!

టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కల్ట్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. భారతీయ సినిమాలో తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ లభించింది. థియేటర్లలో విడుదలకు కొన్ని గంటల ముందు చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కత్తిపోట్లు, కోతలు, భయపెట్టే సన్నివేశాలతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి ట్రైలర్‌లో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, ఓ పార్టీలో జరిగే హింసాత్మక ఘటనల గురించి చూపించారు. తాజాగా వచ్చిన రిలీజ్ ట్రైలర్‌లో మాత్రం విశ్వక్ సేన్ పోషించిన డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.గోవాలో స్థానికులు స్థానికేతరులను, ముఖ్యంగా తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేయడాన్ని సంకల్ప్ సహించడు. వారిని రక్షించాలనే ఉద్దేశంతో గోవాకు వెళ్లిన అతడి చుట్టూ కథ తిరుగుతుంది. ట్రైలర్ చివర్లో పార్టీలో అతడు సాగించే హత్యాకాండను చూపించారు. యాక్షన్‌తో పాటు స్లాషర్ తరహా సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ దూకుడు, క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాత్రకు తగ్గట్టుగా ఆయన ఆగ్రహభరితమైన నటన ఆకట్టుకుంటోంది. హింసాత్మక సన్నివేశాలను కూడా ప్రత్యేకమైన శైలిలో, కొంత కార్టూన్ తరహా రూపంలో తెరకెక్కించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో మురళీ శర్మ రాజకీయ నాయకుడిగా, శ్రీకాంత్ అయ్యంగార్ సీనియర్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతాన్ని అందించగా, తరుణ్ భాస్కర్ సంభాషణలు రాశారు. విడుదల ట్రైలర్‌లో కనిపిస్తున్న రక్తపాతం, వేగవంతమైన యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మరి 'కల్ట్' ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

అది సీక్వెల్ కాదు, అక్కడితోనే క్లోజ్..

- ధనుష్ 'ఓం' సినిమాపై క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓం -- చాప్టర్ 1. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలు సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి.'ఓం' చాప్టర్ 1, చాప్టర్ 2 సినిమాల మధ్య ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సినిమా టైటిల్‌లో 'చాప్టర్ 1' అని ఉన్నప్పటికీ, ఇది రెండు భాగాలుగా కొనసాగే సీక్వెల్ కాదని, మొదటి భాగంతోనే ఈ కథ పూర్తిగా ముగిసిపోతుందని ఆయన వెల్లడించారు. అలాగే తాము ఈ చిత్రాన్ని కేవలం ఒక భాషలో మాత్రమే కాకుండా, ద్విభాషా చిత్రంగా ప్లాన్ చేయనప్పటికీ.. తమిళ మరియు తెలుగు ప్రేక్షకులు ఇద్దరూ దీన్ని తమ సొంత స్ట్రైట్ సినిమా అనే అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు అంత్యంత ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి (ఏఎస్పీ నిత్యా రెడ్డి పాత్రలో) మరియు టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇద్దరి పాత్రలు వారి ఇప్పటివరకు చేసిన సినిమాలకు, వారి కంఫర్ట్ జోన్‌కు పూర్తిగా భిన్నంగా, అవుట్ అండ్ అవుట్ కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

హీరోయిన్ కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం..

మద్యం మత్తులో వ్యక్తి అసభ్య ప్రవర్తన.. భర్త సీరియస్..

టాలీవుడ్, కోలీవుడ్‌లలో తనదైన అభినయంతో, సహజమైన నటనతో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతున్న హీరోయిన్ కీర్తి సురేశ్. మహానటి సినిమాకుగానూ జాతీయ అవార్డు అందుకున్న ఈ అమ్మడు ఇప్పుడు కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. హిట్టు, ఫ్లాపులతో సంబంధమే లేకుండా ప్రేక్షకులు మెచ్చే కథలను ఎంపిక చేసుకుంటూ బిజీగా ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి సురేశ్ తన జీవితంలో ఎదురైన ఊహించని సంఘటన గురించి పంచుకుంది. సినిమాలతో ఎప్పుడూ బిజీగా ఉండే ఈ బ్యూటీకి ఇటీవల విమాన ప్రయాణంలో ఒక చేదు అనుభవం ఎదురైనట్లు చెప్పుకొచ్చింది. సెలబ్రిటీలు ఎక్కడికి వెళ్లినా వారిని గుర్తించి అభిమానం చూపించడం సాధారణమే అయినప్పటికీ, కొంతమంది ప్రవర్తించే తీరు ఒక్కోసారి ఇబ్బందికరంగా మారుతుంటుంది. తాజాగా కీర్తి సురేశ్ విషయంలోనూ అదే జరిగిందని వెల్లడించింది.వివరాల్లోకి వెళితే.. కీర్తి సురేశ్ తన భర్తతో కలిసి విమాన ప్రయాణంలో ఉన్న సమయంలో తోటి ప్రయాణికులలో ఒక వ్యక్తి మద్యం మత్తులో ఆమె వద్దకు వచ్చాడని తెలిపింది. విమానం గాల్లో ఉండగానే ఆ వ్యక్తి పరిమితులు మీరి ఆమెతో సెల్ఫీ దిగాలని తీవ్రంగా ఇబ్బంది పెట్టాడని వెల్లడించింది. కేవలం ఫొటో కోసమే కాకుండా, ఆయన ప్రవర్తించిన తీరు కాస్త అభ్యంతరకరంగా ఉండటంతో కీర్తి సురేశ్ తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని.. వెంటనే అతడికి దూరంగా జరిగినట్లు వెల్లడించింది.వెంటనే అప్రమత్తమైన తన భర్త ఆంటోని సీరియస్ అయ్యాడని.. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో అక్కడే ఉన్న విమాన సిబ్బందిని పిలిచినట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన క్యాబిన్ క్రూ సిబ్బంది జోక్యం చేసుకుని ఆ వ్యక్తిని అక్కడి నుంచి పంపించివేశారని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సెలబ్రిటీల వ్యక్తిగత భద్రత , ప్రైవసీకి భంగం కలిగించేలా ఇలా ప్రవర్తించడం పట్ల నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా సరే అభిమానం పేరుతో హద్దులు మీరి ప్రవర్తించడం సరికాదని, విమానాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెడుతున్నారు.

నిహారిక కొణిదెల నిర్మాణంలో నూతన చిత్రం 'పాకెట్ రాకెట్స్'..

-టైటిల్ పోస్టర్ రిలీజ్!



ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెలకు చెందిన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్', 'మాక్సిమం సిటీ స్టూడియోస్' సంస్థలు సంయుక్తంగా నూతన చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'పాకెట్ రాకెట్స్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేయగా, బుధవారం నాడు దీనికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. రుద్ర అత్రి దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో 'కమిటీ కుర్రోళ్ళు' ఫేమ్ త్రినాథ్ వర్మ, నూతన నటుడు నిర్మల్ హీరోలుగా నటిస్తుండగా, 'శుభం' ఫేమ్ శ్రియా కొంతం హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే ఇందులో ప్రముఖ నటుడు జేడీ చక్రవర్తి ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు.విదేశాల్లో చదువుకోవాలని కలలు కనే ఓ కుర్రాడు, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి గ్యాబ్లింగ్ (జూదం) వైపు అడుగులు వేయడం, ఆ తర్వాత అతని జీవితంలో ఎదురైన ఊహించని పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా అత్యంత ఆసక్తికరంగా సాగనుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తి కాగా, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన టీజర్ అలాగే రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి గ్యానీ సంగీతం అందిస్తుండగా, ఎదురోలు రాజు సినిమాటోగ్రాఫర్‌గా, అన్వర్ అలీ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్రినాథ్ వర్మ, శ్రియా కొంతం, నిర్మల్, జేడీ చక్రవర్తితో పాటు శ్రీనివాస్ అవసరాల, శ్రీనివాస్ వడ్లమాని, కిరిటీ దామరాజు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఆ బాధ జీవితాంతం వెంటాడుతుంది

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటించిన సినిమా పెద్ది. డైరెక్టర్ బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ మూవీ సూపర్ హిట్ అయ్యింది. కానీ ఇందులో అచ్చియమ్మ పాత్రలో నటించిన జాన్వీ కపూర్ ను చూపించిన విధానంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మహిళలను కించపర్చేలా ఆమె పాత్రను చూపించారని.. అవసరానికి మించిన గ్లామర్, అలాగే అసభ్యకరంగా చూపించారంటూ సోషల్ మీడియాలో మండిపడ్డారు నెటిజన్స్. అలాగే పలువురు సెలబ్రిటీలు సైతం ఈ వివాదంపై రియాక్ట్ అయ్యారు. అయితే తాజాగా పెద్ది వివాదం పై జాన్వీ కపూర్ స్పందించారు. బాలీవుడ్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ హోస్ట్ చేస్తున్న కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్న జాన్వీ కపూర్ పెద్ది వివాదంపై తన ఆలోచనలను, అలాగే ఆ సమయంలో తాను మౌనంగా ఉండటానికి కారణాలను వెల్లడించింది. పెద్ది విషయంలో ఏం జరిగింది. అది నిన్ను చాలా విధాలుగా ప్రభావితం చేసిందని నాకు తెలుసు. ఎందుకంటే ఆరోజు నేను నీతో మాట్లాడాను. ఆ సీన్స్ చిత్రీకరిస్తున్నప్పుడు నువ్వు ఎందుకు ఆపలేదు అని ప్రశ్నించే వర్గం ఉంది. దీనిపై నీ సమాధానం ఏంటీ అని ప్రశ్నించారు కరణ్ జోహార్.దీనిపై జాన్వీ కపూర్ స్పందిస్తూ.. సినిమా కోసం ఎంతో మంది కష్టపడ్డారని నాకు తెలుసు. అందుకే ఆ విషయం గురించి మాట్లాడటానికి ఆలోచించాను. పెద్దిలో నా పాత్రను చూపించి తీరు సమాజంపై.. ముఖ్యంగా మహిళల పట్ల ఉండే దృక్పథంపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందని అన్నారు జాన్వీ. అయితే ఈ విషయంలో నేను కూడా బాధ్యత తీసుకోవాలి. ఇప్పటికీ ఆ విషయంపై నాకు బాధగా ఉంది. ఆ భారాన్ని నేను ఎప్పటికీ మోస్తూనే ఉంటాను అని చెప్పుకొచ్చారు. ఇకపై తాను ఈ విషయం గురించి ఎక్కడా ప్రస్తావించాలనుకోవడం లేదని.. అలా మాట్లాడితే ఇతరులను నిందించినట్లు అవుతుందని అన్నారు. ఆ సమయంలో నేను నా అభ్యంతరాలను గట్టిగా వినిపించి ఉండాల్సింది అని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ ఎదురుకాకుండా చూసుకోవడమే ఇప్పుడు తన ముందున్న లక్ష్యమని అన్నారు. సాధారణంగా దర్శకుడు చెప్పిన విధంగా పనిచేయాలనే ఒత్తిడి నటీనటులపై ఉంటుందని.. ప్రొఫెషనల్ గా ఉండాలనే ఉద్దేశంతో దర్శకుడు చెప్పింది చేశానని అన్నారు. అలా అని తప్పును ఇతరులపై నెట్టడం తనకు నచ్చదని అన్నారు. ఈ వివాదం తనకు ఎప్పటికీ బాధాకరమైన అనుభవంగానే మిగిలిపోతుందని అన్నారు. ప్రస్తుతం జాన్వీ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.